

1
నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం 29 జూన్ 2023



నేటికీ అందని దుస్తులు





'ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలల పున:ప్రారంభ సమయంలోనే యూనిఫాం అందిస్తాం. దుస్తులిచ్చేందుకు వివిధ డిజైన్లను పరిశీలించి ఒకటి ఎంపిక చేశాం. యూనిఫాం ధరించి తరగతులకు హాజరైతే విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుంది. ఒకే రకమైన దుస్తులేసుకోవడం వల్ల తారతమ్యాలకు తావుండదు' ఇవీ.. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఫిబ్రవరిలో చెప్పిన మాటలు.

విద్యార్థులకు స్కూల్ డ్రెస్ పంపిణీ ప్రక్రియ ఈ సారీ ఆలస్యమే అయ్యింది. గతేడాది వస్త్రం రావడం ఆలస్యమైంది. ఈ ఏడాది బడులు తెరిచేలోపే సిద్ధం చేస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదు. స్కూల్స్ ప్రారంభమై రెండు వారాలు గడిచినా ఇంకా విద్యార్థులకు దుస్తులందలేదు. గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌కు వస్త్రమే అందలేదు. ప్రభుత్వ బడుల్లో 20న విద్యాదినోత్సవం రోజు కొన్ని పంపిణీ చేశారు. పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. విద్యార్థులు పాత దుస్తుల్నే వేసుకుని బడికొస్తున్నారు. గతంలో ఇచ్చిన దుస్తులు నాణ్యతగా లేకపోవడంతో చినిగిపోవడం, సైజు చిన్న పెద్దదవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలకు స్కూల్ డ్రెస్ అందించేందుకు వివిధ ఫ్యాషన్ డిజైనర్లతో మోడల్స్ తెప్పించారు. ఫిబ్రవరిలో ఒక డిజైన్‌ను ఎంపిక చేసి వాటిని కుట్టించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. విద్యార్థులకు దుస్తులు కుట్టించేందుకు అవసరమైన వస్త్రాన్ని టెస్కో ద్వారా సేకరించాలి. మార్చి నుంచి ఏప్రిల్ వరకు దశలవారీగా వస్త్రాన్ని సరఫరా చేయాలి. డీఈఓలకు పంపిన మార్గదర్శ కాల మేరకు దుస్తుల్ని కుట్టించి విద్యార్థులకు పంపిణీ చేయాలి. ఇప్పటి వరకు సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు వస్త్రం అందలేదు. స్కూల్స్ విద్యార్థులకు దుస్తులు కుట్టించే పనులు జరుగుతున్నాయి.

స్కూల్ డ్రెస్ ఇలా...

1, 2, 3వ తరగతుల్లోని బాలికలకు ఫ్రాక్‌లు కుట్టిస్తారు. కుడి వైపున పాకెట్, బెల్ట్ పెట్టుకోవడానికి వీలుగా రింగులు, ఎదురు కుచ్చిళ్లను కుడతారు. వీరికి షర్ట్ భుజంపై పట్టి, చేతులకు క్లిప్పులు ఉండేలా చూస్తారు. 4, 5వ తరగతుల అమ్మాయిలకు స్కర్ట్, షర్ట్‌లను కుట్టిస్తారు. క్లిప్పులు, పట్టీలు అమర్చుతారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అమ్మాయిలకు పంజాబీ డ్రెస్ కుట్టిస్తారు. భుజాలపై చున్నీకి బదులుగా యూ ఆకారంలో వాస్కోటు ఉంటుంది. 6 నుంచి 12వ తరగతి బాలురకు షర్ట్, ప్యాంట్, నిక్కర్లు కుట్టిస్తారు. ప్రభుత్వ స్కూల్ విద్యార్థులతో పాటు కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ఎయిడెడ్, రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులందరికీ ఒకేలా దుస్తుల్ని అందజేయాలని నిర్ణయించారు. 1వ తరగతి నుంచి 8 వరకు విద్యార్థులకు దుస్తుల పంపిణీ కోసం కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం కేటాయిస్తుంది. 9, 10వ తరగతులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి స్థాయిలో నిధుల్ని ఖర్చు చేస్తుంది.

హాస్టల్స్, గురులాలకు అందని వస్త్రం

విద్యార్థులకు డ్రెస్సులు కుట్టించేందుకు అవసరమైన వస్త్రం సరఫరాలోనే తీవ్ర జాప్యం జరుగుతోంది. టెస్కో ద్వారా ఏప్రిల్ 30 నాటికే సరిపడా వస్త్రాన్ని అందించాలి. ప్రభుత్వ స్కూల్స్‌కు జిల్లా విద్యా శాఖకు, సంక్షేమ హాస్టల్స్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలకు, గురుకులాలకు వస్త్రం అందజేయాలి. రాష్ట్ర స్థాయిలో టెండర్లు పిలిచి పిల్లల సైజుల్ని బట్టి దుస్తుల్ని కుట్టి ఇవ్వాలి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని సంక్షేమ హాస్టల్స్‌కు వస్త్రం అందలేదని పలువురు హాస్టల్ సంక్షేమాధికారులు తెలిపారు. గురుకులాలకు కూడా వస్త్రం రాకపోయే సరికి కొత్తగా చేరిన విద్యార్థులకు గతంలో పంపిణీ చేయగా మిగిలిపోయిన దుస్తులనే ఇస్తున్నారు. అవి విద్యార్థుల సైజులకు సరిపోకపోయినా వాటినే వేసుకోవాలని వత్తిడి చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 33, మెదక్ జిల్లాలో 12, సంగారెడ్డి జిల్లాలో 20పైనే గురుకులాలున్నాయి. మూడు జిల్లాల్లో 150 వరకు హాస్టల్స్ ఉన్నాయి. వీటిల్లో 50 వేల వరకు విద్యార్థులున్నారు. వీరెవ్వరికీ ఈ విద్యా సంవత్సరంలో కొత్త దుస్తులివ్వలేదు. సంగారెడ్డి జిల్లాలో 2.60 లక్షల మంది విద్యార్థులకు దుస్తులివ్వాలి. సిద్దిపేట జిల్లాలో 1.86 లక్షలు, మెదక్ జిల్లాలో 1.73 లక్షల దుస్తులివ్వాల్సి ఉంది. ఇంత వరకు 50 శాతం దుస్తులు మాత్రమే విద్యార్థులకు అందాయి. అదీ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన విద్యా దినోత్సవం సందర్భంగా దుస్తుల్ని అందజేశారు. ఉమ్మడి జిల్లాలో పది వేల మంది వరకు గురుకులాల్లో ఈ విద్యా సంవత్సరంలో చేరారు. బడిబాట కార్యక్రమంలో మూడు జిల్లాల్లో 15 వేల మంది వరకు చేరారు. వీరందరికీ యూనిఫాం లేకపోవడంతో రకరకాల దుస్తులతోనే బడికొస్తున్నారు.

ప్రతి ఏటా ఆలస్యమే

విద్యార్థులకు దుస్తుల్ని అందజేయడంలో ఏటా ఆలస్యమే అవుతోంది. గతేడాది ఆగస్టు వరకు దుస్తులిస్తామని చెప్పారు. జనవరి వరకు కూడా విద్యార్థులకివ్వలేదు. దీంతో దుస్తుల్ని అందజేయడం సాధ్యపడలేదు. ఈ ఏడాదైనా పాఠశాలల పున:ప్రారంభానికి ముందే దుస్తుల్ని అందజేస్తామని విద్యా శాఖ మంత్రి ప్రకటించారు. జూన్ చివరి నాటికి ఇంకా వస్త్రమే అందలేదు. నాణ్యత ఉండట్లేదు. సైజులు కూడా విద్యార్థులకు సరిపడేలా ఉండట్లేదు.

– రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

దుస్తులు అందలేదు

ఈ విద్యా సంవత్సరానికి దుస్తులు అందలేదు. కొత్తగా చేరిన విద్యార్థులకు దుస్తులివ్వాలి. పాత వారికి గతంలో ఇచ్చిన దుస్తులుండడం వల్ల ఇబ్బందిలేదు. త్వరలోనే దుస్తులు వస్తాయి. అవి రాగానే అందరికీ దుస్తులు అందిస్తాం.

– ప్రభాకర్, ఆర్‌సీఓ

గ్రూప్-4 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ - మెదక్

జులై 1న జరిగే గ్రూప్-4 పరీక్షలు సజావుగా నిర్వహించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవరం కలెక్టరేట్‌లో ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, రమేష్‌లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన 11257 అభ్యర్థులు పరీక్షలు వ్రాయుటకు జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాలను ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూలై 1న రెండు సెషన్స్‌లో పరీక్ష జరుగుతుందని, మొదటి సెషన్ ఉదయం 10:00 నుండి 12:30 గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 2:30 నుండి 5:00 గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉ8:00 నుండి 9:45గంటలకు గంటల వరకు అనుమతిస్తామని, మధ్యాహ్నం సెషన్ లో 2:15 గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని తెలియజేశారు. అభ్యర్థుకు కాళ్ళకు చెప్పులతో మాత్రమే పరీక్ష హాలుకు రావాలని, షఉస్ కు అనుమతి లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా మొబైల్ ఫోన్, క్యాలిక్యులేటర్, వాచ్, బెల్ట్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని, పరీక్షా కేంద్రం గేటు బయటే అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి పంపాలన్నారు. అభ్యర్థులు తమ వెంట డౌన్ లోడ్ చేసుకున్న హాల్ టికెట్, సరైన ఫోటో గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్ పై హాల్ టికెట్ నెంబర్, బుకలెట్ నెంబరు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తో రాసేలా ఇన్విజిలెటర్లు చూడాలని, పరీక్ష హాలులో ఆబ్సెంట్ అయిన విద్యార్థుల సీట్లలో కేవలం ప్రశ్నపత్రం మాత్రమే ఉంచాలన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు నియమించిన రూట్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, లయజన్ అధికారులు సమన్వయం చేసుకొని పరీక్షలు సజావుగా నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల దగ్గర త్రాగునీరు, ఇతర వసతులు కల్పించాలని, పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





సంగారెడ్డి జిల్లాలో 101 కేంద్రాల్లో పరీక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో జులై 1న నిర్వహించనున్న గ్రూప్ 4 పరీక్షలు సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి జిల్లాలో గ్రూప్ -4 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను చేసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో మొత్తం 101 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 33,456 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. టి.ఎస్.పి.ఎస్.సి. గైడ్ లైన్స్ ను ప్రతి ఒక్కరూ చదివి, నిబంధనలు పాటించాలని, లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు పరీక్షా కేంద్రాలను ముందస్తుగా సందర్శించి తాగునీరు, విద్యుత్, సీటింగ్, సి.సి. కెమెరాలు, ఇతర మౌలిక వసతులను చూసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్‌లను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రంలో ఒక ఏఎన్ఎంను మెడికల్ కిట్ తో అందుబాటులో ఉంచాలన్నారు. పోలీస్ బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులు వెళ్ళే ముందు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని, అప్రమత్తులై విధులు నిర్వహించాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, సెల్ ఫోన్లు, రైటింగ్ ప్యాడ్స్ అనుమతించరని తెలిపారు. జిల్లాలో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రశాంతంగా నిబంధనల ప్రకారం పరీక్ష రాసేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలెటర్‌ను నియమించినట్లు తెలిపారు. పరీక్షకు 15 నిమిషాల ముందుగా పరీక్ష కేంద్రం గేట్ మూసివేయాలని, ఉదయం జరిగే పరీక్షకు 8 గంటల నుంచి 9.45 గంటల వరకు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు మధ్యాహ్నం 1 గంటల నుంచి 2.15 గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించడం జరుగుతుందని, పరీక్షా కేంద్రం గేటు మూసిన తర్వాత ఎవరిని లోపలికి అనుమతించరని స్పష్టం చేశారు. దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ లో సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నామినల్ రోల్స్ లో ఎక్కడైనా ప్రింటింగ్ రాకపోతే డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇన్విజిలేటర్లకు ఈనెల 30న ఖచ్చితంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను పోలీసుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూం నుండి తరలించాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ నగేష్, డిప్యూటీ డిఇఓ విజయ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల, కేజీబీవీల్లో అందని పౌష్టికాహారం

- ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారుతో పస్తులుంటున్న విద్యార్థినులు
- కేజీబీవీ హాస్టల్‌లో గుడ్లు, పాలు ఇవ్వని పరిస్థితి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్

నవతెలంగాణ-టేక్మాల్

విద్యా సంవత్సరం ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా బుక్స్, యూనిఫామ్స్ రాలేదని, జిల్లా అధికారులు మండల అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వల్ల హాస్టల్లో పౌష్టికాహారం అందడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ అన్నారు. బుధవారం టేక్మాల్ మండల కేంద్రంలో ఆశ్రమ, కేజీబీవీ హాస్టల్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో స్థానిక ప్రిన్సిపాల్ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఉడికీఉడకని అన్నం పెట్టడంతో కొంతమంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. 80 మందికి మూడు కిలోల దొండకాయ తీసుకొచ్చి విద్యార్థులకు వడ్డిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఓ మేడం లేకపోవడం వల్ల సమస్యలు కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయని తెలిపారు. విద్యార్థులకు గదులలో ఫ్యాన్లు లేకపోవడం వల్ల అవస్థలు పడుతున్నారని తెలిపారు. హీటర్ సౌకర్యం లేక చన్నీళ్లతో స్నానం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు బుక్స్ యూనిఫార్మ్ రాలేదని అలాగే పాలు గుడ్లు ఇవ్వడంలేదని అన్నారు. విద్యార్థులకు నీళ్ల చారుతో వడ్డిస్తున్నారని తెలిపారు. మెదక్ జిల్లాలో 15 కేజీబీవీల్లో ఇదే పరిస్థితి కనబడుతుందని తెలిపారు. జిల్లా అధికార పర్యవేక్షణ లేకపోవడం వల్ల స్థానిక ఎస్ఓలు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు వచ్చే ప్రతి సామగ్రిని ఇవ్వడంలేదని తెలిపారు. సాయంత్రం స్నాక్స్ కూడా పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదని మండిపడ్డారు. టేక్మాల్ మండలం కేజీబీవి హాస్టల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో డీఈఓ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జగన్, పాల్గొన్నారు.



వడ్ల డబ్బుల కోసం చెప్పుల లైన్

- ధాన్యం అమ్మిన డబ్బుల కోసం ఇబ్బంది పడుతున్న రైతులు
- సెంట్రల్ బ్యాంక్ ఎదుట పడిగాపులు

నవతెలంగాణ వెల్దుర్తి

వడ్లను అమ్ముకొని డబ్బుల కోసం నిరీక్షిస్తున్న తమ కష్టాలు తీర్చేది ఎవరని రైతులు వాపోతున్నారు. సెంట్రల్ బ్యాంక్ ముందు పడిగాపులు కాస్తున్న రైతులు ఎప్పుడు బ్యాంకు తెరుస్తారో ఈరోజు ఎంత డబ్బు ఇస్తారో అంటూ ఐదు గంటల్లోపే నిద్రలేచి ఆదరాబాదరాగా బ్యాంకు వద్దకు పరుగు తీస్తున్నారు. నిద్ర మత్తు దిగక ముందే బ్యాంకు వద్దకు చేరుకొని చేతగాక చెప్పులను లైన్లో పెట్టి వెల్దుర్తి సెంట్రల్ బ్యాంకు ఎదుట పడిగాపులు కాస్తున్నారు. బుధవారం సెంట్రల్ బ్యాంక్ ఎదుట లైన్‌లో చెప్పులు పెట్టి ధాన్యం డబ్బుల కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. యాసంగి సీజన్లో పండించిన ధాన్యం ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరుగుతుందని ప్రగల్బాలు పలికిన రాజకీయ నాయకులు ఎటెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్లు కాంటా పెట్టి రెండు నెలలు గడుస్తోంది. రెండు రోజుల క్రితం బ్యాంకుల్లో డబ్బులు జమ చేయడంతో ఒకేసారి రైతులందరు బ్యాంకు వద్దకు పరుగులు తీయడంతో బ్యాంక్ అధికారులు ఒక ఖాతాదారునికి రూ.పది వేలు మించి ఇవ్వడం లేదు. సెంట్రల్ బ్యాంక్ వద్ద రద్దీ చాలా ఎక్కువగా ఉండటంతో లైన్లో నిలుచుని ఓపిక లేక రైతులు తమ చెప్పులను లైన్లో పెట్టి బ్యాంకు ఎదుట కూర్చొని ఎదురు చూశారు.



సర్పంచ్ చంద్రగౌడ్ కృషి అభినందనీయం

- ప్రభుత్వేతర సంస్థల సహకారంతో గ్రామాలభివృద్ధి భేష్
- నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నవతెలంగాణ-హత్నూర

ప్రభుత్వేతర సంస్థల సహకారంతో గ్రామాన్ని అభివద్ధి పర్చడంలో తురకలఖానాపూర్ సర్పంచ్ మామిడిపల్లి చంద్రగౌడ్ చేసిన కషి అభినందనీయమని నర్సాపూర్ శాసన సభ్యులు మదన్ రెడ్డి అన్నారు. మండలంలోని తురకల ఖానాపూర్, తాహర్‌ఖాన్‌పేట గ్రామాల్లో ప్రతి వార్డులో నిర్మించిన సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనం, అండర్ గ్రౌండ్ డ్రయినేజీలను వాడ వాడలా తిరిగి ప్రారంభోత్సవం చేయడంతో పాటు కొత్తగా మంజూరైన గ్రామ పంచాయతీ భవనం, యాదవ కమ్యూనిటీ హాల్, ముదిరాజ్ కమ్యూనిటీ హాళ్లకు భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ రెడ్డిని, తెలంగాణా రాష్ట్ర అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మెన్ దేవేందర్ రెడ్డిని ఓపెన్ టాప్ జీపులో ఊరేగిస్తూ, డీజే చప్పుల మధ్య తెలంగాణ పాటలతో ఘన స్వాగతం పలికారు. వారికి క్రేన్ సాయంతో గజమాల వేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రభు త్వం గ్రామాభివద్ధికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి పూర్తిస్థాయిలో సీసీరోడ్లు నిర్మించి, స్థానికంగా ఉన్న పరిశ్రమల సహకారంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అంగన్వాడి భవనం నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన గ్రామ పంచాయతీ భవనంతో పాటు యాదవులకు ముదిరాజులకు వేరువేరుగా కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు త్వరలోనే పూర్తవుతాయన్నారు. ముందు ముందు కూడా గ్రామానికి ప్రభుత్వం ద్వారా అందే ప్రతి పైసా సక్రమంగా వినియోగిం చుకుని గ్రామాభివద్ధికి మరింత తోడ్పాటు అందించాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పొట్లచెరువు ఆంజనేయులు, కాసాల పీఏసీఎస్ చైర్మెన్ దామోదర రెడ్డి, హత్నూర పీఏసీఎస్ చైర్మెన్ దుర్గా రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ తీగల బుచ్చిరెడ్డి, బి ఆర్ ఎస్ కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్షులు శివ శంకర్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు వి.శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు టి. రాజేందర్, తుర్కల ఖానాపూర్ ఎంపీటీసీ సభ్యులు మీనం పల్లి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.





అధికారులు మెడపై కత్తిపెట్టి..

- ఉత్సవాలు చేయించారు
- రూ.లక్ష ఇస్తామని రూ.35 వేలు మాత్రమే ఇచ్చారు
- సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆందోళన

నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలను అధికారులు సర్పంచుల మెడలపై కత్తులు పెట్టి చేయించారని మల్చల్మ సర్పంచ్ పాండురంగారెడ్డి జగదీశ్వర్ వాపోయారు. తమకు తెలియకుండానే గ్రామంలో చాటింపు చేయించి లక్షలు ఖర్చు చేయించారని.. తమకు మాత్రం కేవలం రూ.35,000 మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీపీ గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా మల్చల్మ సర్పంచ్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తమ గ్రామంలో చెరువుల ఉత్సవాలు నిర్వహిస్తున్నామని.. ఇందుకు ప్రభుత్వం లక్ష రూపాయల వరకు ఖర్చు చేస్తున్నదని, ప్రతీ ఒక్కరూ హాజరు కావాలని తనకు తెలియకుండా చాటింపు చేయించారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులను సర్పంచ్, కార్యదర్శులు తింటున్నారని తమపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయని.. దీంతో అధికారులు చెప్పినట్టుగా లక్షలు ఖర్చు చేశామన్నారు. అయితే అధికారులు మాత్రం తమకు రూ.35 వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. మిగిలిన డబ్బులు ఎక్కడి నుంచి చెల్లిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు ఇరిగేషన్ శాఖ ఏఈ జానకిరామ్ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అధికారులకు లక్ష రూపాయలు ఇచ్చారు కనుక.. ఇరిగేషన్ శాఖ నుండి కూడా అన్ని డబ్బులు వస్తాయని తెలిపారన్నారు. ఉన్నత అధికారులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెల్పడంతోనే తాము గ్రామంలో సాటింపు వేయించామన్నారు. దీంతో సమావేశం మొత్తం గందరగోళంగా మారింది. చివరికి ఎంపీపీ గిరిధర్ రెడ్డి కల్పించుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. సర్పంచులు ముందే అప్పుల ఊబిలో ఉన్నారని.. ఇలాంటి సమయంలో వారిపై ఒత్తిడి తీసుకువచ్చి కార్యక్రమాలను నిర్వహించడం సబబు కాదన్నారు. దీంతో మిగతా డబ్బులను తాను గ్రామంలో బహిరంగ సభను ఏర్పాటు చేసి చెల్లిస్తానని ఏఈ జానకిరామ్ అనడంతో ప్రజాప్రతినిధులందరూ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశాల్లో ఇరిగేషన్ శాఖలో చేపట్టాల్సిన కార్యక్రమాలను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చినా స్పందించకపోవడంతో.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ..మండలాన్ని ఉత్తమ మండలంగా, కొత్తూరు, శాఖాపూర్ గ్రామాలను ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బి శాఖ నుంచి నిధులు మంజూరై టెండర్లు రద్దు అవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం మంచి పరిణామం కాదన్నారు. అలాగే పలు అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వ్యక్తం చేస్తున్నారని.. ఇలాగే కంటిన్యూ అయితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. గత నెల రోజులుగా పీహెచ్‌సీలో షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించకపోవడం, సరియగు మందులు చెల్లించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఎంపీటీసులు సంబంధిత అధికారులను నిలదీశారు. అయితే ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నదని.. గత నెలలో మందులు రానందునే ఇవ్వలేకపోయామని డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. అనంతరం పలువురు అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులు గురించి వివరించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ నాట్ శెట్టి రాథోడ్, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాములు, అధికారులు పాల్గొన్నారు.



మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-సంగారెడ్డి



మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీఎస్ హెచ్ డి సి చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని ఈద్గా వద్ద బక్రీద్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలో హిందువులు, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉంటారని, ఎలాంటి కలహాలకు ఇక్కడ తావులేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పండుగలకు నిధులు కేటాయిస్తూ అధికారికంగా నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి రవి, సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ అంజద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభా గౌడ్, కౌన్సిలర్లు షేక్ సాబేర్, సోహెల్, అజ్జు, యాకూబ్ అలీ, జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, పాండు, చర్యల ప్రభాకర్, వాజిత్, శ్రావణ్ రెడ్డి పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట జిల్లాకు చెందిన మాజీ ఎంపీ సోలిపేట రామచంద్రారెడ్డి మృతి చెందడంపై రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాదులో వారి కుటుంబీకులను పరామర్శించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

భూనిర్వాసితుల ఇళ్ల పట్టాల పంపిణీ

నవతెలంగాణ ములుగు



కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, మెదక్ డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డిలు అన్నారు. మండలంలోని మామిడియాల బహిలంపూర్ గ్రామాల నిర్వాసితులకు ములుగు రెవెన్యూ కార్యాల యంలో తహసీల్దార్ ప్రవీణ్ రెడ్డి ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం డబుల్ బెడ్రూం ఇళ్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి లావణ్య అంజన్ గౌడ్ జెడ్పీటిసి జయమ్మ అర్జున్ గౌడ్,ఏఎంసీ వైస్ చైర్మన్ భూపాలరెడ్డి, ఎంపీటీసీ లింగా రెడ్డి, హరిబాబు, మామిడియాల సర్పంచ్ నాగరాణి శ్రీనివాస్ గౌడ్,ఉప సర్పంచ్, ములుగు మండల యాదవ సంఘం అధ్యక్షులు ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు.

సంగాపూర్ హెచ్ఎంను సస్పెండ్ చేయాలి

నవ తెలంగాణ -గజ్వేల్



విధులకు రాకుండా నిర్లక్ష్యం వహిస్తున్న సంగాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు నాచారం శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. పాఠశాలలో 111 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఇక్కడ ఒకే టీచర్ పనిచేయడంతో విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పాఠ్యపుస్తకాలు అక్రమంగా అమ్ముతున్న ఐడియాల్ స్కూల్ బుక్‌స్టాల్ సీజ్

నవతెలంగాణ తూప్రాన్ రూరల్ మనోహరాబాద్



నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తుండడంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం తూప్రాన్ మండల కేంద్రంలోని ఐడియాల్ స్కూల్ బుక్‌స్టాల్‌ను సీజ్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ ఎలాంటి పర్మిషన్ లేకుండా పుస్తకాలు అమ్ముకుంటున్నారన్నారు. ఎంఈఓ ఆఫీస్ నుంచి మండల వ్యాప్తంగా నోటీసులు జారీ చేసి వారం రోజులు గడుస్తున్నా యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేకుండా పోయిందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ మండల కమిటీ సభ్యులు రమేష్ పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ పర్యటన

నవతెలంగాణ- కొల్చారం



మండల పరిధిలోని కొంగోడు గ్రామంలో బుధవారం పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రామారావు పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా నిర్మించిన డంపింగ్ యార్డుతో పాటు పల్లె ప్రకృతి వనం, తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. సర్పంచ్ కుకునూరి మంజుల సత్యనారాయణ గౌడ్, మండల పంచాయతీ అధికారి కృష్ణవేణి, ఏపీవో మహిపాల్ రెడ్డి, ఏపీఎం సుశీల్య, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఐకేపీ వివోఏ శంకర్ ఉన్నారు.

బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు జమ

గజ్వేల్‌లో పెరిగిన కొనుగోళ్లు

నవ తెలంగాణ- గజ్వేల్



రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం గజ్వేల్‌లో సంత కావడంతో మార్కెట్ రైతులతో కిటకిటలాడింది. సీఎం కెసిఆర్ రైతు బంధు నిధులు రైతు ఖాతాల్లో జమ కావడంతో విత్తనాలు, నిత్యావసర సరుకుల కొనుగోలుతో రద్దీ పెరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర ఫర్టిలైజర్ షాప్ యజమాని, కొండ పోచమ్మ దేవస్థానం డైరెక్టర్ గోలి సంతోష్ మాట్లాడుతూ గతంలో రైతులు విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు కోసం ఉద్దెర అడిగేవారని, సీఎం కెసిఆర్ రైతు గోస తీర్చడానికి దేశంలో ఎక్కడా లేని విధంగా పంట సహాయంగా ఎకరాకు పది వేలు అందించడంతో నగదు చెల్లించి కొనుగోలు చేశారని తెఇపారు.

అనుభవపూర్వక అభ్యాసం అవశ్యం

నవ తెలంగాణ - పటాన్‌చెరు




ఒక పనిని చేయడం ద్వారా నేర్చుకునే ప్రక్రియనే ప్రయోగాత్మక అభ్యాసం అంటారని, అనుభవపూర్వక అభ్యాసం సాంకేతిక విద్యా సంస్థలలో అవశ్యమని క్వాలికాట్ టెక్నాలజీస్ ప్రొడక్ట్ మేనేజ్ ప్రేమ్ కుమార్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'మెషిన్ లెర్నింగ్ - ఇట్స్ అప్లికేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల అధ్యాపక వికాస కార్యక్రమం ముగింపు ఉత్సవం బుధవారం నిర్వహించారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతు అనుభవపూర్వక అభ్యాసం నైపుణ్యాలు, ఆసక్తులు, అభిరుచులు, విలువలు, విభిన్న సంస్థలతో వ్యవహరించే నేర్పుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుందన్నారు. ప్రేమ్‌కుమార్‌తో పాటు టిక్-టాక్-టోను ప్రదర్శించిన రామ్ కుమార్ ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, నిర్వాహకుడు ప్రొఫెసర్ కె. మంజునాథా చారి శాలువా, జ్ఞాపికలను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు తమ అనుభవాలు, అభిప్రాయాలను పంచుకున్నారు. రిసోర్స్ పర్సన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈఈసీఈ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీ రామకృష్ణ వందన సమర్పణతో ఈ మూడు రోజుల కార్యక్రమం ముగిసింది.

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కోసం సెలక్షన్స్

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్, రీజినల్ స్పోర్ట్స్ స్కూల్స్ కరీమ్ నగర్, ఆదిలాబాద్‌లలో 4 , 5వ తరగతి అడ్మిషన్స్ కోసం సంగారెడ్డి జిల్లాలోని అన్నీ మండల స్థాయిల్లో వచ్చేనెల 1 నుంచి 5వ తేదీ వరకు సెలెక్షన్స్ నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన బాల బాలికలకు జిల్లా స్థాయిలో వచ్చేనెల 9 నుంచి 15 వరకు, జిల్లా స్థాయిలో ఎంపికైన బాల బాలికలకు 24 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు సెలక్షన్స్‌లో పాల్గొనాలని సూచించారు. చదువుతున్న పాఠశాల నుంచి తీసుకున్న చదువుతున్న ధృవపత్రం, తహసీల్దార్/ పంచాయతీ/ మునిసిపల్ /కార్పొరేషన్ నుంచి జారీ చేసిన జనన ధృవపత్రం తీసుకరావాలాన్నారు.10 పాసుపోర్టు సైజ్ ఫొటోస్, 3, 4వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్‌లు, కమ్యూనిటీ సర్టిఫికెట్స్ తీసుకురావాలన్నారు. మండలాల్లో సంబంధిత మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహిస్తారన్నారు. మిగతా వివరాలకు జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయంను ఫోన్ నెం. 08455-276010, 274344 మరియు సెల్ నంబర్ 9000491112లలో సంప్రదించవచ్చని తెలిపారు.



నవతెలంగాణ 2

సంగారెడ్డి

గురువారం 29 జూన్ 2023

జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



నవతెలంగాణ-జోగిపేట

హర్యానాలోని రోహతక్‌లో జరిగిన 10వ జూనియర్ జాతీయస్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో తెలంగాణ బాలుర జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి.. ద్వితీయ స్థానంలో నిలిచింది. బుధ వారం జరిగిన తుది పోరులో మహారాష్ట్ర జట్టుపై ఓడిపోవడంతో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కప్పుతో పాటు సిల్వర్ మెడల్‌ను క్రీడాకారులు అందుకున్నారు. అయితే తెలంగాణ బాలుర జట్టుకు సంగారెడ్డి జిల్లా క్రీడాకారులు సాయి దీపక్, విష్ణు (అందోల్), ఉపేందర్(అచ్చనపల్లి తండా) ప్రాతి నిధ్యం వహించారు. గెలుపొందిన క్రీడాకారులను తెలంగాణ టార్గెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి రేవంత్ అభినందించారు. కాగా జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించడం పట్ల చాలా గర్వంగా ఉందని, మరిన్నో పతకాలు సాధించి జిల్లా పేరును దేశ నలుమూలల తెలియజేసేలా కృషి చేయాలని, మరిన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి తరుణ్ రాజ్, అధ్యక్షులు సేనపతిలు ఆకాంక్షించారు. గెలుపొందిన క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



నవతెలంగాణ-జోగిపేట

'గ్రంథాలయాలు విజ్ఞాన భాండా గారాలు' అని జోగిపేట గ్రంథాలయ అధి కారి రాజ్ కుమార్ అన్నారు. బుధ వారం జోగిపేటలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం రాధాబా యితో కలిసి విద్యార్థులు గ్రంధాల యాన్ని సం దర్శించారు. ఈ సందర్భగా విద్యార్థులు వివిధ రకాల పుస్తకాలను, పేపర్లను పఠ నం చేశారు. అనంతరం రాజ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రంథాల యంలో అవస రమైన పోటీతత్వ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తక పఠనంఅలవర్చుకోవాలని సూచించారు.

యువత ఉపాధి అవకాశాలతో అభివృద్ధి చెందాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

యువత ఉపాధి అవకాశాలతో అభివృద్ధి చెందాలని మాజీ ఎంపీపీ కొలను రవీందర్‌రెడ్డి అన్నారు. బుధ వారం బొల్లారంలోని మల్లికార్జున ఆధ్వ ర్యంలో నూతన ఫుడ్ కోర్టును కౌన్సిలర్ గుండ్ల మహేందర్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. వ్యాపారం అభివృద్ధి దిశగా పయనించాలని ఆకాంక్షించారు. అనంతరం వారిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో పాల్గొన్న టీపీసీసీ నాయకులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని పద్మ శాలి కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన యం.రమేష్ బాబు కుమారుడి వివాహానికి టీపీసీసీ నాయకులు వై.నరోత్తం, డీసీసీబీ మాజీ చైర్మెన్ ఎం జైపాల్‌రెడ్డిలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ సునీల్ కుమార్, శ్రీకాంత్, జి.శివరాజ్, చెంగల్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సోషల్ వెల్ఫేర్ చైర్ పర్సన్ స్వప్నభాస్కర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్నభాస్కర్ మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమా నికి సంబంధించి ఎస్సీ, బీసీ, మైనార్టీ మరియు వికలాంగులకు సంబంధించిన అనేక పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా ఈ సంక్షేమానికి చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురుంచి కూడా చర్చించారు. కార్యక్రమంలో సిఈఓ ఎల్లయ్య ,వట్పల్లి జడ్పీటీసీ అపర్ణశ్రీకాంత్ ,జిల్లా కో ఆప్షన్ మెంబరు మహమ్మద్ అలీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ మరియు వికలాంగుల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు వితరణ



నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని లక్ష్మీపతి గూడెం ప్రాథమిక పాఠశాలకు ఖాజీపల్లి సర్పంచ్ చిట్ల సత్యనారాయణ బెంచీలు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పాఠశాల విద్యార్థులు నేలపై కూర్చుం టున్నారని తెలుసు కున్న సర్పంచ్ సత్యనారాయణ.. వెంటనే స్పందించి 16 బెంచీ లను స్వయంగా పాఠశాలకు బుధవారం అందజేశారు. సర్పంచ్ లావణ్య జీవన్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం సత్యనారాయణకు ప్రత్యేకంగా కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజిపల్లి వార్డు సభ్యులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌లో నివాసముండే సుధాకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. వీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు వి.చంద్రారెడ్డి బుధ వారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి పదివేల సాయం అందజేశారు. సాయ ం అందజేసినప్పుడు రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్ చంద్ర య్య, పాస్టర్లు శంకర్, అబ్రహం, స్థానిక నాయకులు ఏసు, జైపాల్, సత్య ఉన్నారు.

రాములు మృతదేహానికి రామ్‌సింగ్ నివాళ్లు



నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన గడ్డి రాములు బుధవారం ఉదయం మృతిచెం దాడు. ఈ విషయం తెలుసుకున్న నారాయ ణఖేడ్ నియోజకవర్గ ఆత్మ చైర్మెన్ రామ్‌సింగ్ గ్రామ సర్పంచ్ కృష్ణారె డ్డితో కలిసి మృతుని ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సంద ర్శించి.. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్ని అందించారు. ఉపసర్పంచ్ ఈశ్వర్,మాజీ వార్డ్ మెంబర్ వెంకయ్య తదితరులు ఉన్నారు,

వాచ్‌మెన్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్‌కల్‌లోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్టు పాఠశాల ప్రత్యేక అధికారి రుబీనా పర్వీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుండి 45 ఏండ్ల లోపు ఉండి.. కనీసం 7 తరగతి విద్యార్హత కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాల న్నారు. ఈనెల చివరి వరకు దరఖా స్తు చేసుకోవచ్చని సూచించారు. మండల తాసిల్దార్ మునీ రుద్దీన్, ఎంఈఓ మారుతీ రాథోడ్, ఎంపీడీవో వెంకట్రెడ్డి పర్యవేక్షణలో ఎంపిక జరుగుతుంన్నారు.

రైతులకు విత్తనాల మినికిట్స్ అందజేత



నవతెలంగాణ-న్యాల్‌కల్

హద్నూర్, రేజింతల్ క్లస్టర్లలో ఖలీల్‌పూర్ రైతులకు కంది, మిను ముల మినికిట్స్(4కిలోల బ్యాగులు) విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా హద్నూర్, రేజింతల్ ఏఈవో సాయిలు, సనిత్ రెడ్డి మాట్లాడుతూ.. ఖరీఫ్ సాగులో చిరు ధాన్యాలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించొచ్చు అన్నారు. అవసరమున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనుమానాస్పదంగా జేసీబీ క్లీనర్ మృతి

నవతెలంగాణ-వట్‌పల్లి

జేసీబీ క్లీనర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెం దిన ఘటన వట్‌పల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్‌పల్లికి చెందిన యాదగిరి గౌడ్ వద్ద రాజస్థాన్ రాష్ట్రంలోని కైత్వారా గ్రామానికి చెందిన హస్నన్(17) కొన్ని నెలలుగా జేసీబీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఈనెల 27న సాయంత్రం పని ముగించుకున్న హస్నన్ తన అద్దె రూంకి వెళ్లి నిద్రకు ఉపక్రమించాడు. మరసటి రోజు ఉదయం యాదగిరి వచ్చి నిద్రలో ఉన్న హస్నన్ లేపే ప్రయత్నం చేయగా.. ఎంతకూ లేవలేదు. దీంతో మృతి చెం దాడని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. జేసీబీ డ్రైవర్ షాహున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఆత్మగౌరవ భవనాలు.. అభివృద్ధికి వేదికలు

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఈదుల నాగులపల్లిలో కురుమ, కుమ్మరి, ముదిరాజ్ కుల సంఘాల భవనాల ప్రారంభోత్సవం
- ఎస్సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-రామచంద్రాపురం

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కుల సంఘాల ఆత్మగౌరవాన్ని పెంచేలా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాళ్లు అభివృద్ధికి వేదికలుగా నిలుస్తాయని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సి పల్ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో రూ.75 లక్షల అంచ నా వ్యయంతో నిర్మించిన ముదిరాజ్, కురుమ, కుమ్మరి కుల సంఘాల భవనాలను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు ఎమ్మెల్యే జీఎంఆ ర్‌కు భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వార్డు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోనే మొట్ట మొదటిసారిగా రాష్ట్ర రాజధానిలో కుల సంఘాలకు కోట్ల రూపాయలు వెచ్చించి ఆత్మగౌరవ భవనాలు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కులవృత్తులు కనుమ రుగవుతున్న ప్రస్తుత తరుణంలో.వివిధ పథకాల ద్వారా ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. దళిత బంధు దళితుల జీవితాల్లో వెలుగులు తీసుకుని వచ్చిందని, బీసీ బంధు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోందన్నారు. నాగులపల్లిలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ కుల సంఘాల ప్రతినిధులు తమ సాంప్రదాయ రీతిలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమ ంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి, వైస్ చైర్మెన్ రాములు గౌడ్, కమిషనర్ శ్రీనివాస్, రామచంద్రా పురం కార్పొరేటర్ పుష్ప నగేష్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షు లు దేవేందర్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గుంతల్లో కూరుకుపోయిన ఇసుక లారీలు

- గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్
- క్రేన్ సాయంతో బయటికి



నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రమైన వట్‌పల్లి నుంచి అల్లాదుర్గం వైపు వెళ్లే ఆర్అండ్‌బి ప్రధాన రహదారి మీదుగా జహీరాబాద్-బీదర్ వెళ్లే ఇసుక లారీలు పిట్లం-బాన్సువాడ నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే నిత్యం లారీలు తిరుగు తుండడంతో రోడ్డు మొత్తం ధ్వంసమై పెద్ద గోతులు ఏర్పడ్డా యి. ఈ క్రమంలో బుధవారం ఇసుక లోడుతో వెళ్తున్న లారీలు మెడికుంద శివారులో రోడ్డుపై గుంతల్లో ఇరుక్కు న్నాయి. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆ రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. ఆరు నెలల క్రితం ఇదే పరిస్థితి సంభవించడంతో క్రేన్ల సహాయంతో వాహ నాలను బయటకు లాగి రాకపోకలను క్లియర్ చేశారు. ఇప్పుడు కూడా క్రేన్‌లను ఉపయోగించి లారీలను బయటికి లాగడంతో.. మధ్యాహ్నం తర్వాత నుంచి రాకపోకలు ప్రారంభం అయ్యాయి. అయితే పదే పదే ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. గుంతల్లో మొరం నింపి అధికారులు నిర్లక్ష్య ంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అల్లాద ుర్గం నుండి రాయికోడ్ మండల్ సీరూర్ రాయిపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు కృంగిపోవడంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమత్తులు చేపట్టాలని వాహనదారులు కోరతున్నారు.

రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ పై సన్నాహక సమావేశం



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంగు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి, జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ నేతృత్వంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ కార్యక్రమ నేపథ్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహిం చారు. పటాన్చెరువు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ మార్గదర్శనం మేరకు రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ కాంపిటేషన్‌కు సంబంధించిన వివిధ అంశాల వారీగా ప్రత్యేకంగా చర్చించారు. రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ కాంపి టేషన్ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడ ుతూ.. గ్రామాలలో 16 నుంచి 35 ఏండ్ల యువతీ యువక ులందరూ రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్విజ్ కాంపిటీషన్లో విజేత లకు ప్రత్యేక బహుమతులతో పాటు మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటీ మొదటి బహుమతిగా అందించడం జరుగుతుంద న్నారు. ఈ క్విజ్ కాంపిటీషన్ పై ప్రతి గడపగడపకు ప్రచా రాన్ని నిర్వహించాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. రాజీవ్ గాంధీ క్విజ్ కాంపిటీషన్ ఆన్లైన్ ఎగ్జామ్ జులై 2(ఆదివారం)న ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్ గౌడ్, కరుణాకర్ గౌడ్, భాస్కర్, యాదయ్య, నరేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు 'డబుల్' ఇండ్లను స్థానికులకే ఇవ్వాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికులకే ఇవ్వా లని బీజేపీ రాష్ట్ర నాయకులు టీ.నందీశ్వర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికులకే డబుల్ బెడ్ రూమ్ కేటా యించాలని పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం రెవిన్యూ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోదావరి అంజిరెడ్డి, ఎడ్ల రమేష్ లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 22న పటాన్ చెరు నియోజ కవర్గంలోని కొల్లూరులో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారం భించిన 16 వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో స్థానికులకు అరకొరగా కేటాయించడం దారుణమన్నారు. అర్హులైన పేదలకు(75శాతం) పారదర్శకంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నియోజకవర్గ ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు మోహన్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా వివిధ మండలాల మరియు మున్సిపాలిటీలు, డివిజన్‌ల అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయనిధి ఓ వరం



నవతెలంగాణ-జహీరాబాద్

ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం లాంటిదని రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీద్ అన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని కొహిర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ షోయెబ్ గత కొద్దిరోజులుగా కీళ్ల నొప్పులతో బాధపడుతూ నడవలేని స్థితిలో నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆర్థిక సాయం కోసం ఎంపీ బీబీ పాటిల్‌ని సంప్రదించగా.. వెంటనే స్పందించి ఎంపీ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.2.50లక్షల ఎల్ ఓసిని మంజూరు చేయించారు. ఎంపీ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కోహిర్ ఎంపీటీసీ హన్నన్ జావేద్‌తో బుధవారం బాధిత కుటు ంబానికి సంబంధిత చెక్కును షేక్ ఫరీద్ అందించారు. ఈ సందర్భంగా బాధితుడి కటుంబ సభ్యులు ముఖ్యమంత్రి కేసిఆర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీ పాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని రాళ్లకత్వ గ్రామం, రాళ్లకత్వ తాండాలకు చెందిన పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్థానిక యువకుడు సాయి గౌడ్ తన సొంత డబ్బులతో స్కూల్ బ్యాగ్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ విజ్ఞప్తి మేరకు స్కూల్ వాలంటీర్ కు నెలకు రూ.1000 చొప్పున ఒక సంవత్సరం పాటు సాయి గౌడ్, పొట్ట గణేష్ ఇచ్చేందుకు ముందుకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. చెరో రూ.500 ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు లక్ష్మీ స్కూల్ చైర్మెన్, స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ రమా మల్లేశం, మాజీ సర్పంచ్ పాండు, నాయకులు జింక బిక్షపతి,రాయని పెద్ద మల్లేష్,జింక రాములు,నీరుడు బాలేష్, బయన్న మల్లేష్,చింత సత్యనారాయణ, రమేష్ గౌడ్,రాయని కృష్ణ, స్థానిక యువకులు యువకులు పాల్గొన్నారు.

రావూస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సదాశివపేట

ప్రభుత్వ అనుమతి లేకుండా సదాశివపేట పట్టణంలో 'రావూస్ ఇంటర్నేషనల్' పేరిట పాఠశాలను నడిపిస్తుం న్నారని.. వెంటనే సదరు యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ, ఎస్ఎ ఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట బుధవారం ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. ఎలాంటి నిబంధనలు పాటించ కుండా సదాశివపేట పట్టణంలో రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో యజమాన్యం అడ్మిషన్లు తీసుకుంటున్నదన్నారు. విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు విక్రయిస్తున్నదన్నారు. ఒకవైపు తరగతి గదులను నిర్వహిస్తూనే.. మరొకవైపు పాఠశాల యజమాన్యం భవన నిర్మాణాలు చేపట్టడం చూస్తుంటే చట్టాల పైన, ప్రభుత్వం పైన ఈ యజమాన్యానికి గౌరవం లేదని అర్థమవుతు న్నదన్నారు. ఇంత జరుగుతున్నా విద్యాధికారులు ఏం చేస్తున్నారని అని ప్రశ్నించారు. వెంటనే సదరు యాజమా న్యంపై కేసులు నమోదు చేసి.. ఇంతవరకు తీసుకున్న అడ్మిషన్లను తిరిగి విద్యార్థి తల్లిదండ్రులకు ఇప్పించాల న్నారు. లేని యెడల విద్యా అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎ ఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రజినీకాంత్, సీఐటీయూ నాయ కులు మల్లేశం, డివైఎఫ్ఐ కార్యకర్తలు ఎండి యూసుఫ్, మతిన్, రాజు, రమేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిం చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్ ఆరోపించారు. ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర కమిటీ పిలు పులో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ పాఠశా లల్లో బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సదర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కనీసం మూత్ర శాలలు కూడా లేవన్నారు. సబ్జెక్ట్‌లకు సరిపడే టీచర్‌లు కూడా లేరన్నారు. వాచ్మెన్, అటెండర్, పిఈటిలు కూడా లేక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని భయంకరమైన పరిస్థితుల్లో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. పాఠశాలలు ప్రారంభమై 18 రోజులు గడిచిపోయినా పుస్తకాలు అందకపోవడం సిగ్గు చేటన్నారు. విద్యార్థుల జీవితాలు నాశనం అవుతుంటే.. సీఎం మాత్రం మరోమారు అధికారం కోసం పాకులాడుతున్నాడని దుయ్య బట్టారు. విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే ఈ సమస్యలన్ని పరిష్కరించడంతో పాటు.. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా ఉపాధ్యక్షులు గంజి హర్షిత్, జిల్లా కోశాధికారి శ్రీకాంత్, డివిజన్ నాయకులు సునీల్ రవి, చంద్రకాంత్, శివసాయి, సురేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జీ.వో ప్రకారం వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులకు జీవ ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రి సూపరిటెంట్ రమేష్‌కు కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. జీ.వో ప్రకారం రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా.. కేవలం రూ.10000చెల్లిస్తూ కాంట్రాక్టర్ నిలువు దోపిడీ చేస్తున్నాడని ఆరోపించారు. అంతేకాకుండా వేతన ంలో కోతలు విధిస్తూ నిలువు దోపిడి చేస్తున్నాడని.. సదరు కాంట్రాక్టర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు భద్రతను కాంటాక్ట్ నిర్లక్ష్యం చేస్తు న్నాడన్నారు. ఏ కారణం లేకుండానే కార్మికులను నెల రోజుల పాటు పనికి తీసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నా డన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, ఓటీల రూప ంలో చేసిన పనికి డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడ న్నారు. కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కార్మికులు మల్లేశం, కే. మల్లేశం, సురేష్, నందు, లక్ష్మి, జయమ్మ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్ జరగకుండా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం టౌన్‌లో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం జరుగుతోం దని, పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయని.. వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషన ర్‌కి బొల్లారం బీజేపీ పార్టీ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కమిష నర్‌కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయి కిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు తూపల్లి రవీందర్ రెడ్డి, లక్ష్మణ్, సరస్వతి, మేఘనా రెడ్డి, స్రవంతి రెడ్డి, అరుణ్ కుమార్, శారద, ఉదయ్ కిరణ్, మోహిత్, మోహన్, శివ, విష్ణు, రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇండ్ల స్థలాలు, రూ.5లక్షల ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్.మహిపాల్ మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలో వేలమంది పేదలు ఇండ్లు లేక, ఇంటి స్థలాలు లేక అనేక ఇబ్బందులు పడుతునా న్నరన్నారు. వారికి తక్షణమే ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్స్ ఇండ్లల్లో కూ డా అనర్హులే ఉన్నారని.. అలాకాకుండా అసలైన అర్హులకే 'డబుల్' ఇండ్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీ ఐటీయూ, పట్నం, అవ్వాజ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజిరెడ్డి, సలీమోద్దీన్, మూతబీర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని నల్లవల్లి గ్రామానికి చెందిన రాజబోయిన పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో.. బీఆర్ఎస్ గ్రామ నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి.. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అంత్యక్రియల ఖర్చు నిమిత్తం రూ.10,000 ఆర్థిక సాయాన్ని సర్పంచ్ దోమడు శంకర్, మాజీ సర్పంచ్ శ్రీనివ ాస్ తదితర నాయకులు చేతుల మీదుగా అందజేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు మహేష్, సత్యనారాయణ, గణేష్, విక్కీ తదితరులున్నారు.

మాదారం రోడ్డు పనుల పరిశీలన



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం మాదారం రహదారి బీటీ పనులను బుధవారం స్థానిక నాయకులు ఆర్అండ్‌బి అధికా రులు పరిశీలించారు. జిన్నారం నుండి పటాన్చెరు ప్రధాన రహదారి మాదారం గ్రామం గుండా గుంతల మయంగా మారిన రోడ్డు విషయమై స్థానిక సర్పంచ్ సరితా సురేందర్ గౌడ్, స్థానిక నేతలు పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి విజ్ఞప్తి చేయడంతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పనులు వేగం గా కొనసాగుతు న్నాయని గ్రామస్తులు తెలిపారు. రోడ్డు పనులు పరిశీలించిన వారిలో బి ఆర్ ఎస్ మాదారం అధ్య క్షులు గణేష్ ,ఆర్అండ్‌బి అధికారులు తదితరులు ఉన్నారు.



మట్టి రోడ్డుతో అవస్థలు పడుతున్న కాలనీవాసులు



అధికారులు, పాలకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు
సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని వినతులు

నవతెలంగాణ-నిజాంపేట : మండల కేంద్రంలోని దళితుల ఇండ్లకు వెళ్లాలంటే సరియైన రోడ్డు లేక దళితులు నిత్యం ఎన్నో అవస్థలు పడుతున్నారు. నిత్యం ముదిరాజు, మంగలి , బెస్త కులస్తులు గౌడ కులస్తులు, దళితులు ప్రతిరోజు మట్టి రోడ్డు, బురదలో నుంచి నడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వెంబడి మురికి నీరు చేరి దోమలు ఈగల ద్వారా ప్రజలకు రోగాలు సోకే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు గుంతలలో చేరి దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు ఎన్నోసార్లు ఈ రోడ్డుపై జారీ పడ్డారు. ఎమ్మెల్యే అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లినప్పటికీ ఎవరు స్పందించడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. గతంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన సమయంలో సీసీ రోడ్ వేయించి డ్రైనేజీ కట్టిస్తానని హామీ కూడా ఇవ్వడం జరిగింది. ఇప్పటికీ హామీ నెరవేరలేదు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి దళితుల ఇండ్లకు వెళ్లడానికి సీసీ రోడ్ వేసి డ్రైనేజీ కట్టించాలని కాలనీవాసులు కోరుతున్నారు

గుంతల మయంగా రోడ్డు



ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

3ఏకె పరిశ్రమ వద్ద రోడ్డు గుంతల మయంగా మారడంతో రోడ్డుపై వెళుతున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వెంటనే టీఎస్ఐఐసి అధికారులు రోడ్డు మరమ్మత్తులు చేయించి వాహనదారుల ఇబ్బందులను తీర్చాలని బీజేపి నాయకులు హర్షవర్ధన్‌గౌడ్ డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతం ముప్పిరెడ్డిపల్లి నుంచి కాళ్ళకల్ వెళ్లే దారిలో 3ఏకె పరిశ్రమ వద్ద రోడ్డు గుంతలుగా మారింది. దానికి తోడు 3ఏకె పరిశ్రమ పరిశ్రమ యాజమాన్యం రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఇలా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేయించి వాహనదారుల ఇబ్బందులు తీర్చాలని, అలాగే 3ఏకె పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని హర్షవర్ధన్‌గౌడ్ పేర్కొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్ వేతనాలను పెంచి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె నోటీసును తూప్రాన్ ఎంపీడీవో అరుంధతికి బుధవారం కార్మికులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కేటగిరిల వారిగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేవారు. ఇప్పటికే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి పలు మార్లు వినతి పత్రం ఇచ్చినట్టు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వచ్చే నెల 5 వరకు కార్మికులను చర్చలకు పిలవాలని లేదంటే 6వ తేదీ నుంచి పనులను ఆపేసి సమ్మె బాట పట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేఖర్, కార్మికులు యాదగిరి, సురేష్, స్వామి, శివ, మహేశ్, మహెందర్, రమేష్, లక్ష్మి, నర్సమ్మ, బాలయ్య, నర్సింగరావ్ తదితరులు పాల్గొన్నారు.

ఊర కుక్కల బెడద తీవ్రతరం



మూకుమ్మడిగా పశువులపై దాడి

నవతెలంగాణ-వెల్దుర్తి

ఊర కుక్కల బెడద తీవ్రతరాన్ని ఎవరు అరికట్టలేక పోతున్నారని చనిపోయిన పాడి పశువుల పెంపకం దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలో చేరిల గ్రామ పరిసరాల ప్రాంతంలో ఊర కుక్కల దాడికి తట్టుకోలేక పాడి పశువులు మేకలు కాకావికలమయ్యాయి. గత రెండు రోజుల్లో రెండు దుడ్డేలను రెండు మేకలను కొరికి చంపి రక్తం తాగి మనుషులపైకే పరుగులు తీస్తున్నాయని పాడి పశువుల పెంపకం దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊరు కుక్కలను అదుపు చేయకపోతే రానున్న రోజుల్లో మనుషులపై కూడా దాడి చేసి చంపుతాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ సిబ్బంది ఊర కుక్కల ఆగడాలను కట్టడి చేసి ఊరు బయటకు తరలించే విధంగా చూడాలని కోరుతున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



వైయస్సార్ టీపీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేష్

నవతెలంగాణ-టేక్మాల్

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లను, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని వైయస్సార్ టీపీపీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి .నరేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ రాకపోవడంతో పేద విద్యార్థులు పై చదువులను చదవలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని, ఆ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, సంతోష్ ,ప్రభాకర్ , నితిన్, పాల్గొన్నారు.

నిజాంపేట మండలంలో యూరియా కొరత

నవతెలంగాణ-నిజాంపేట్ : వానాకాలం మొదలై దాదాపు 20 రోజులు అవుతున్నప్పటికీ నిజాంపేట మండలంలో నేటికీ యూరియా దొరకకపోవడం రైతులను కలవర పెడుతున్నది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతన్నలకు విత్తనాలు పుష్కలంగా ఉన్నప్పటికీ యూరియా దొరకకపోవడంతో అయోమయంలో రైతన్న కొట్టుమిట్టాడుతున్నాడు. ఒకపక్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగ వద్దని చెప్తూనే ఇప్పటివరకు యూరియా సరఫరా చేయకపోవడమేమిటని రైతులు వాపోతున్నారు. మండల కేంద్రంలో దాదాపు 8 ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నప్పటికీ ఏ ఒక్క షాపులో యూరియా దొరకకపోవడం శోచనీయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెండు సొసైటీలు ఉన్నప్పటికీ ఏ ఒక్క సొసైటీలో కూడా యూరియా దొరకడం లేదంటూ రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యునిగా రత్నాకర్



నవ తెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యునిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు అయిత రత్నాకర్ తెలిపారు. హైదరాబాద్ చింతల్ బస్తీలోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో నియామక పత్రం అందుకున్నానని, నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గానికి, సిద్ధిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ, మహిళా విభాగం, యువజన విభాగం, సేవాదళ్ విభాగం కార్యవర్గ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. తాను స్వీకరించిన పదవికి న్యాయం చేస్తానని, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి, మహాసభ సభ్యత్వాన్ని పెంపొందించుటకు, వైశ్యుల ఐక్యతకు కృషి చేస్తానని తెలిపారు.

30న ఛలో హైదరాబాద్



నవతెలంగాణ-తొగుట

రాబోయే ఎన్నికల్లో మాదిగలకు 13 ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలని ఎంఆర్పీ ఎస్ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు బొంబాయి వెంకట్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాల కృష్ణలు డిమాండ్ చేశారు. బుధవారం 30 వతేదీన హైదరాబాదులో జరిగే సభను జయప్రదం చేయాలని మండల కేంద్రంలో కరపత్రం విడుదల చేశారు. అనంతరం లింగాల కృష్ణ మాట్లాడుతూ మాదిగల జనాభా ప్రకారం "మేం ఎంతో మాకు అంత నినాదంతో" మాదిగల జనాభా ప్రకారం రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీలన్నీ మాదిగలకు 13 ఎమ్మెల్యే స్థానాలు రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జూన్ 30న హైదరాబాదులో జరవగే సభను జయప్రదం చేయాలని కోరారు. రాజ్యాధికారం లేని కులాలు అంతరిస్తాయని అంబేద్కర్ ఏనాడో చెప్పారని గుర్తు చేశారు. యాదవులకు, గౌండ్లకు, చేనేత కార్మికులకు ఇస్తున్నట్లుగా మాదిగలకు డప్పు, చెప్పు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తుందని కాని ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లింగాల మహేష్, మండల నాయకులు లింగాల స్వామి పాల్గొ న్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పోతరం ఎస్ గ్రామంలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులను బుధవారం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కొప్పుల రాములు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు. గ్రామంలో పరిశుభ్రత, మురికి కాలువలు శుభ్రం, చెత్త తీసివేత గ్రామ అభివృద్ధిలో కార్మికుల సేవలు ఉన్నతమైనవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు, ఎంపిటిసి శ్రీనివాస్, వర్డుసభ్యులు ఈశ్వర్ రెడ్డి, ఎల్లయ్య, కవిత, సరిత, లత, స్వరూప, సరిత పాల్గొన్నారు.



వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- అలుగులు, బుంగలు, బ్రిడ్జిల మరమ్మత్తులు చేపట్టాలి
- కేజ్ వీల్స్ రోడెక్కకుండా అవగాహన కల్పించాలి
- జెడ్పీ సమావేశానికి హాజరుకాని జిల్లా అధికారులకు మెమోలు ఇవ్వాలి
- ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-మెదక్

వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, శిథిలమైన అలుగులు, బుంగలు, బ్రిడ్జిల మరమ్మత్తులు చేపట్టాల్సిందిగా ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మెదక్ జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతశేఖర్ గౌడ్ అధ్యక్షతన స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనులపై చర్చించే జిల్లా స్థాయి సంఘ సమావేశాలకు జిల్లా అధికారులు హజరుకాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రాకపోతే సమావేశం ఎందుకు పెట్టాలి, వాయిదా వెద్దమా అని ప్రశ్నించారు. హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే శివ్వంపేటలో మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వడానికి నాలుగు నెలలు సమయం పట్టించని, అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని జెడ్పీటీసీ సభ్యులు మండిపడ్డారు. ఎండాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడాల్సి వచ్చిందన్నారు. ఈ విషయమై విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఆదేశించారు. నిజాంపేట్ గ్రామంలోని పలు కాలనీలో సరిపడా నీటిని సరఫరా చేయడం లేదని జెడ్పిటిసి సభ్యులు తెలిపారు. ట్యాంక్ నిండినదా లేదా అని చూసుకోవడం లేదన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు మాట్లాడుతూ గెట్ వాల్స్, చెర్రలు స్లీప్ అయ్యే అవకాశం ఉందని, సమస్యను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా నిజాంపేట స్కూల్‌లో శిథిలావస్థలో ఉన్న ట్యాంకును తొలగించాలని సభ్యులు వెల్లడించారు. ఎస్ఆర్ఈజీఎస్ కింద ఆడ పిల్లలు ఎక్కువ ఉన్న పాఠశాలల్లో మరుగుదొడ్లు కట్టేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్సీ సూచించారు. అలాగే వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో కెనాల్‌ల వద్ద ఉన్న లీకేజీలను మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. గత వర్షాకాలంలో కొట్టుకుపాయిన అలుగులు, బుంగలను, బ్రిడ్జిల మరమత్తులు చేయాలన్నారు. రైతులు సాగుకు సమాయత్తం అవుతున్నందున కేజ్ వీల్ ట్రాక్టర్లు ఎన్ని ఉన్నాయన్న గుర్తించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రబ్బర్లు లేకుండా కేజ్ వీల్ ట్రాక్టర్లు రోడ్డు మీదకు వస్తే జరిమానాలు వేయాలని ఆదేశించారు. ముందుగా రైతులకు ఈ విషయమై అవగాహన కల్పించాలని సూచించారు. స్కూల్ బస్సుల ఫిట్నెస్‌ల గురించి పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఈఓ వెంకట శైలేష్, జెడ్పీటీసీలు మహేష్ గుప్తా, పంజా విజయ్ కుమార్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



వ్యర్థపదార్థాలను వేస్తున్న పరిశ్రమకు నోటీసులు

- పరిశ్రమ యాజమాన్యానికి, పొలం యజమానికి జరిమానా





నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్) : పరిశ్రమలోని ఆహార వ్యర్థ పదార్థాలను వేయడంతో పర్యావరణ కాలుష్యానికి పాల్పడడంతో పాటు వ్యాధులు ప్రభలే ఆస్కారం ఉన్నందున వెంటనే వ్యర్థాలను తొలగించాలని అలాగే జరిమానా చెల్లించాలంటూ పంచాయితీ కార్యదర్శి పరిశ్రమ యజమానితో పాటు పొలం యజమానికి జరిమానా విధించారు. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో ప్రైమ ఫుడ్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఉంది. అందులో వివిధ ఫ్రూట్స్‌తో జ్యూస్ తయారు చేస్తారు. కాగా ఆహార వ్యర్థ పదార్థాలను గ్రామానికి చెందిన నరాల పెంటయ్యకు చెందిన సర్వె నంబర్ 45లోని పొలంలో వేస్తున్నారు. దాంతో ఆహార పదార్థాలు కుళ్లిపోయి దుర్వాసనతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు వ్యాధులు ప్రభలే ఆస్కారం ఉంది. దాంతో గ్రామ పంచాయితీ సభ్యుల తీర్మాణంతో పరిశ్రమ యాజమాన్యానికి, పొలం యజమని నరాల పెంటయ్యకు నోటీసులు జారీ చేశారు. దాంతో పాటు వెంటనే వ్యర్థాలను తొలగించాలని లేదంటే పంచాయితీ రాజ్ చట్టం 2018 ప్రకారం చర్యలుంటాయని కార్యదర్శి స్వామిగౌడ్ పేర్కొన్నారు. ఆహార వ్యర్థాలను పోసినందుకు పరిశ్రమ యాజమాన్యానికి, అలాగే పొలం యజమాని నరాల పెంటయ్యకు చెరో ఐదు వేల రూపాయల జరిమానా విధించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు అందని వైద్యం



నవతెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అవసరాల కోసం వచ్చిన గర్భిణీలకు అందాల్సిన వైద్యం అందడం లేదని వాపోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గర్భిణీ స్త్రీ పరీక్షలు నిమిత్తం వచ్చి పరీక్షలు చేయించుకున్న తర్వాత డాక్టర్ శాలిని సెలైన్ బాటిల్ అవసరం ఉన్నాయని వారితోనే బయట నుంచి తెప్పించారు. ఇదేమిటనే గర్భిణీ స్త్రీలకు సహాయకులుగా వెళ్లినవారు ప్రశ్నించగా, ప్రభుత్వం నుంచి సరఫరా లేదని, ప్రభుత్వం నుంచి వచ్చే వరకు వేచి చూడాలంటే వారం రోజుల సమయం పడుతుందని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. విషయం తెలుసుకున్న విలేకరులు, ప్రజాప్రతినిధులు డాక్టర్ల వద్దకు వెళ్లి విచారించగా వేరే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి తెప్పించి గర్భిణీ స్త్రీలకు చికిత్సలు అందించారు.

అపోలో ఫార్మ కంపెనీ కాలుష్యంతో రైతులకు నష్టం

- ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కలుషితం నీరు
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎంపీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-చేగుంట

మండలంలోని వడియారం గ్రామంలో ఉన్న అపోలో ఫార్మా కంపెనీ నుంచి వచ్చే వ్యర్థ జలాల నుంచి పంట భూములు పాడవుతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అలాగే ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కలుషితమైన నీరు వస్తున్నాయని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. వడియారం గ్రామంలో వెలసిన అపోలో ఫార్మ కంపెనీ చుట్టుపక్కల సుమారు 15 నుంచి 16 ఎకరాల వరకు రైతులు పంటపొలాలను సాగు చేసుకుని జీవిస్తున్నారు. ఈ అపోలో ఫార్మలో ముడి సరుకులతో తయారయ్యే వ్యర్థాలు రైతుల పంట పొలాల్లోకి చేరి పూర్తిగా పంటలు నష్టపోతున్నారన్నారు. రైతులు పండించిన ఆరుగాలం పంట ఈ కంపెనీ వల్ల ఎందుకు పనికి రాకుండా పోతుందన్నారు. పలుమార్లు కంపెనీ యజమానులకు పంట పొలాలు నష్టపోతున్న విషయం తెలిపినప్పటికీ వారు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తు ఎక్కడ ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోండని సమాధానమిస్తూ రైతులను బెదిరించారన్నారు. అలాగే గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో వేసిన బోరులో ఈ కంపెనీ వల్లనే కలుషితమైన నీరు వస్తుందన్నారు. ఇటీవల శుభకార్యంలో చిన్న పిల్లలు తెలియక ఆ నీటిని తాగి తీవ్ర అవస్థకు గురయ్యారని కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ కంపెనీ వల్ల రైతులకు, ఫంక్షన్ హాల్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తక్షణమే రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ ఎంపిటిసి గూటం నవీన్ ఉన్నారు.



అంగన్వాడీ టీచర్‌ను నియమించాలి

చేగుంట మండలం బి కొండాపూర్ గ్రామంలో అంగన్వాడి టీచర్, ఆయాలు లేక గత మూడు సంవత్సరాల నుంచి గ్రామంలో గర్భిణీలు, చిన్నపిల్లలు, బాలింతలు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే టీచర్‌ను నియమించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షాకు బుధవారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్, బి కొండాపూర్ ఎంపిటిసి గూటం నవీన్‌లు వినతి పత్రాన్ని అందజేశారు. బి కొండాపూర్ గ్రామానికి ఎస్టి అంగన్వాడీ రిజర్వుడు టీచర్ లేకపోవడంతో, వేరే కులాలకు రోస్టర్ ద్వారా టీచర్ను, ఆయాలను, ఎంపిక చేసి చిన్నపిల్లలకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు, ఇబ్బందులు తలెత్తకుండా గ్రామానికి అంగన్వాడీ టీచర్‌ను, ఆయాను నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

గిరిజన గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

ఈ నెల 30 నుంచి జూలై 5 వరకు గడువు
జిల్లా అదనపు కలెక్టర్ రమేష్

నవతెలంగాణ-మెదక్ : జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పూర్తి తాత్కాలిక పద్దతిన పార్ట్ టైం ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ తెలిపారు. ఈ నెల 30 నుంచి జూలై 5 వరకు దరఖాస్తులను మెదక్ పట్టణంలోని మినీ గురుకులంలో ప్రాంతీయ సమన్వయకర్త కార్యాలయంలో పని దినాలలో సమర్పించాలని సూచించారు. బాలికల పాఠశాలల్లో మహిళలు మాత్రమే అర్హులని వివరించారు. పీజీ, బీఈడీతో పాటు టెట్ ఉత్తీర్ణులైనవారు అర్హులని తెలిపారు. బాలికల జూనియర్ కళాశాల విభాగానికి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ, సివిక్స్, ఎకానామిక్స్, తెలుగు, ఆంగ్లం, గణితం, పాఠశాల విభాగానికి తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజిక్స్, సాంఘిక శాస్త్రం, పీఈటీ కొరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బాలుర జూనియర్ కళాశాల విభాగానికి తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారని వివరించారు. పీజీ, బీఈడీలో సెకండ్ డివిజన్‌లో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఉపాధ్యాయుల ఎంపిక పూర్తి పారదర్శకంగా డెమో, మెరిట్ ఆధారంగా ఉంటుందన్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయాలని తెలిపారు.

బోరు మోటర్ ఫిట్టింగ్ చేసిన కాంగ్రెస్ నాయకులు

నవ తెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని కుర్మ కాలనీ వాసులకు గత నెల రోజుల క్రితం మైనంపల్లి రోహిత్ సహకారం తో నూతన బోరు వేయించారు. ఈ నూతన బోరుకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పంజా మహేందర్ సహకారంతో పంపు మోటార్‌ను అందించడంతో మంగళవారం నూతన బోరును పంజా మహేందర్ ప్రారంభించారు. దీంతో నూతన బోర్ మోటార్‌కు సహకరించిన మైనంపల్లి రోహిత్, పంజా మహేందర్‌కు కుర్మ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్, పంజా బాబు, జాల రవి, దేవుని రాజు, కుర్మరాజ్యం,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..



అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అధికారులు సహకరించాలి

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అధికారులు సహకరించాలని దళిత సంఘాల నాయకులు సంజీవ్, కడారి నాగరాజు, పంబల బిక్షపతి, శాంతయ్య, శ్రీకాంత్, నరసింహులు, గణేష్‌లు కోరారు. బుధవారం చిప్పల్‌తుర్తి గ్రామానికి వెళ్లి ఆ గ్రామానికి చెందిన దళితులు చేపడుతున్న ఆందోళనకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ చిప్పల్‌తుర్తి గ్రామానికి చెందిన దళితులు రెండు సంవత్సరాల క్రితం అంబేద్కర్ విగ్రహాన్ని తీసుకువచ్చారన్నారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలనుకున్న సమయంలో ఆ గ్రామానికి చెందిన అగ్రవర్గ కులస్తులు స్థలం విషయంలో అడ్డుకున్నారన్నారు. అప్పటి నుంచి విగ్రహాన్ని పంచాయతీ కార్యాలయంలో ఉంచారన్నారు. రెండు రోజుల క్రితం అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించడానికి ఆ గ్రామానికి చెందిన దళితులు దిమ్మెపై పెట్టారన్నారు. దీంతో ఆ గ్రామానికి చెందిన ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం జరిగిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ షేక్ లాల్ మదర్, ఎస్సై శివ కుమార్‌లు వారి సిబ్బందితో గ్రామానికి వెళ్లి అంబేద్కర్ విగ్రహాన్ని గద్దే నుంచి తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం సహకరించాలని, లేకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన దళితులు ఎల్లయ్య, రాజయ్య, సురేష్, రాములు నర్సింలు, బాలరాజు, రాజు, ప్రభాకర్, శ్రీనివాస్, శ్రీ పాల్ పాల్గొన్నారు.



జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూల్లో 50 శాతం ఫీజు రాయితీ

- సర్క్యులర్ జారీ చేసిన సంగారెడ్డి డీఈఓ వెంకటేశ్వర్లు
- హర్షం వ్యక్తం చేసిన సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్



నవ తెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లల ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు (డీఈఓ) ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. 2023-24 విద్య సంవత్సరానికి సంబంధించి సంగారెడ్డి జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని స్పష్టం చేశారు. జర్నలిస్టుల పిల్లలకు స్కూళ్ల ఫీజులో రాయితీ కోరుతూ ఇటీవల సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారులను కలిసి సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధి బృందం డీఈఓకు వినతి పత్రం అందించింది. ఇందుకు గాను డీఈఓ సానుకూలంగా స్పందిస్తూ సర్క్యులర్ జారీ చేశారు. ఫీజు రాయితీపై డీఈఓ ఆదేశాలపై అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సాయినాథ్, కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నజీర్ అహ్మద్, అసోసియేషన్ సభ్యులు వీరేందర్ గౌడ్, అశోక్ బాబు, రఘు నాయక్, రమేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టు సరైంది కాదు



ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేశ్

నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ నాగర్ కర్నూలు, నిజామాబాద్ జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను, విద్యార్థులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయడం సరైనది కాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేశ్ కాదన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. సమస్యలు పరిష్కారం చేయకుండా విద్యార్థి నాయకులను ఈడ్చుకుంటూ అరెస్ట్ చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. విద్యార్థులు ఎమైనా ఉగ్రవాదులా? ఆయన ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లాలో కలెక్టరేట్ ఎదుట శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులను, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, జిల్లా నాయకత్వాని అరెస్ట్ చేసి ఐదుగురిపై కేసులు నమోదు చేశారన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని మహేశ్ డిమాండ్ చేశారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్ క్లబ్ కృషి
మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేష్ గౌడ్



నవ తెలంగాణ-మెదక్ టౌన్ : సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రతి జర్నలిస్టు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని అజంపురలో గల షాదీఖానాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ సభ్యత్వాన్ని అందజేశారు. అంతకుముందు ఇటీవల డిడి న్యూస్ రిపోర్టర్ శ్రీనివాస్ మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నరేష్‌గౌడ్, ప్రసాద్‌లు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులు తమ ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని, కొందరు వ్యక్తుల చేష్టల వలన ప్రెస్‌కు చెడ్డ పేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రెస్ క్లబ్ ఏర్పడిన అనతి కాలంలోనే జర్నలిస్టుల అందరి ఐక్యతతో మెరుగైన ఫలితాలు సాధించుకోడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రెస్‌క్లబ్ భవన్ నిర్మాణపు పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మరో రెండు నెలల్లో అన్ని హంగులతో భవనాన్ని పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే రెండో విడుత జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను అలాట్మెంట్ చేసుకోవడం జరిగిందని, త్వరలో పట్టాలను ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సభ్యత్వాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు రానివారికి సైతం ఎమ్మెల్యేతో చర్చించి త్వరలో ఇప్పించెందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా సమిష్టి కృషితో ముందుకు వెళ్దామని కోరారు. జర్నలిస్టు పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీ తీసుకోవాల్సిన అవసరం ఉందని, జర్నలిస్టు పిల్లల వివరాలను తెలియజేయాలన్నారు. జర్నలిస్టుల అందరి సంక్షేమం కోసం ప్రెస్ క్లబ్ పని చేస్తుందని, ఐక్యతతో హక్కులను సాధించుకుందామని తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రెస్‌క్లబ్ బాధ్యులు దేవయ్య, కామటి కిషన్, రాజు, గోపాల్, నర్సింహ చారి, హరి, సురేందర్, వికాస్, నవీన్, రియాజ్, సంగమేశ్వర్, చంద్రశేఖర్, నాగరాజు శర్మ, రాజాగౌడ్, సందీప్, సిద్ధు, ప్రకాష్, లక్ష్మన్ తదితరుల ఉన్నారు.

వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఆయుష్ వైద్యురాలు రజని



నవతెలంగాణ-కొండపాక

వర్షాకాల వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు తీసుకోవాలని కొండపాక ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ రజని తెలిపారు. బుధవారం కొండపాకలో ఉచిత వైద్యం నిర్వహించి 187 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద మందులు, ఆయుర్వేద విధి విధానాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమ కాటు వల్ల వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటివి రాకుండా పలు జాగ్రత్తలు వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులైన మోకాళ్ళ నొప్పులు, శ్వాస కోశ సమస్యలు, పక్షవాతం, మధుమేహం వ్యాధులకు చికిత్సలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది శివ సంధ్య తదితరులు ఉన్నారు.



పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచిన వ్యాపార సంస్థలపై జరిమానా

నవతెలంగాణ - సిద్దిపేట



పట్టణంలోని అక్షయ బిర్యానీ సెంటర్ వారు మిక్స్‌డ్ వేస్ట్ ఇస్తునందుకు పెనాల్టీ వేయడం జరిగిందని శానిటరీ ఇన్స్పెక్టర్ వనిత తెలిపారు. బుధవారం పట్టణంలోని 23 వ వార్డులో పర్యటిస్తున్న సందర్భంగా ఆదిత్య ఆసుపత్రి, ఓ బుక్ డిపో చెత్తను బయట వేస్తున్నందుకు పెనాల్టీ వేసినట్లు ఆమె తెలిపారు. ఇమేజ్ హాస్పిటల్ భవన ఓనర్ ఆస్పత్రి ముందు వెళ్లే మురికి కాల్వ పై స్లాబు నిర్మాణం చేశాడని, వాటిని తొలగించాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి



నవతెలంగాణ-కొండపాక

పార్టీ పటిష్టతకు కార్యకర్తలు సమష్టిగా కలిసి పని చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేది రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమేనని అందుకోసం కార్యకర్తలంతా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి , సిద్దిపేట జిల్లా మైనార్టీ ప్రెసిడెంట్ జాకీర్ షరీఫ్, పిఎసిఎస్ డైరెక్టర్ నరసింహ చారి పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ షరీఫ్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని లద్నూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ ఫరీద్‌కు యూనివర్సిటీ ఫిలాసఫీ విభాగంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఉన్నత విద్యామండలి మాజీ ఉప చైర్మన్ ప్రొ. మల్లేశం సంకసాల పర్యవేక్షణలో "ఫిలసాఫికల్ ఇంప్లికేషన్స్ ఆఫ్ ప్రొఫెషనల్ ఎథిక్స్ : ఎ క్రిటికల్ స్టడీ" అనే అంశం పైన పరిశోధన చేసినందుకుగాను ఓయూ డాక్టరేటును ప్రకటించింది. ఉపాధ్యాయ వృత్తి పరమైన నీతి, న్యాయపరమైన నీతి, వైద్య సంబంధ నీతి, వాణిజ్య నీతి, పాత్రికేయ నీతి అనే అంశాలపై విమర్శనాత్మక ఉత్తమ పరిశోధన చేశారు. పరిశోధకుడు అబ్దుల్ ఫరీద్ వివిధ విభాగాల్లో మొత్తం ఐదు పీజీలు చేసిన విద్యార్థికుడు. బిఇడి కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన అనుభవం ఉంది. తెలంగాణా బిఇడి లెక్చరర్ అసోసియేషన్ అధ్యక్షులుగా పని చేస్తున్నారు. అల్పసంఖ్యాక కుటుంబం నుండి ఎన్నో అవరోధాలను అధిగమించి, నిరంతరం శ్రమించి డాక్టరేట్ పట్టా పొందిన అబ్దుల్ ఫరీద్ కు ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థి మిత్రులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పరిశోధకుడు అబ్దుల్ ఫరీద్ మాట్లాడుతూ సాధారణ ప్రభుత్వ పాఠశాల నుండి ప్రారంభమైన తన విద్యాప్రస్తానంలో తనను అనునిత్యం ప్రోత్సహించిన గురువులకు, ప్రొఫెసర్లకు, వెన్నంటే ఉండి సహకరించిన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

బక్రీద్ పండుగ శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ముస్లింలకు ఈద్ ఉల్ అదా(బక్రీద్) పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలన్నారు. ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ చేసుకుంటారన్నారు. భక్తి భావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. ఈ పండుగ సోదర భావం, ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలన్నారు. అల్లా దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

గ్రూప్-4 పరీక్షల ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ- దుబ్బాక

జూలై 1న జరగనున్న గ్రూప్-4 పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు లైజన్ ఆఫీసర్ వీరేష్ తెలిపారు. దుబ్బాక పట్టణ కేంద్రంలో 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కేసీఆర్ స్కూల్),ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీటింగ్ అరేంజ్మెంట్ పనులను లైజన్ ఆఫీసర్ వీరేష్ బుధవారం పరిశీలించారు. పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ,ఎస్ఐ బత్తుల మహేందర్,గ్రామ సేవకులు ఉన్నారు.

చెట్లనర్సంపల్లిలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని చెట్లనర్సంపల్లి గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్, మేడ్చల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం సర్పంచ్ వేమ జనార్ధన్ ప్రారంభించారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన 150 మంది ప్రజలు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం జరిగిందన్నారు. వైద్య పరీక్షల అనంతరం మందులను ఉచితంగా అందజేశామని తెలిపారు. కొందరిని సోమవారం హాస్పిటల్‌కి తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మీ చంద్రిక, సమన, హర్షిణి, అనిరుద్, కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ విద్యార్థిపై దాడికి పాల్పడిన ఇద్దరు విద్యార్థుల సస్పెండ్




నవతెలంగాణ-కొండపాక

వెలికట్ట శివారులోని శ్రీ కృప ఫార్మసీ కళాశాలలో చదు వుతున్న విద్యార్థులు గొడవప డిన విషయంలో దాడికి పాల్పడిన ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ కళాశాల ప్రిన్సిపాల్ నోటీసు అందజేశారు. ఫార్మసీ చదువుతున్న సీనియర్ విద్యార్థి సమీర్‌ను జూనియర్ విద్యార్థులు మంగళవారం దాడి చేసి చితకబాదిన సంఘటన తెలిసిందే. ఈ విషయంలో ప్రిన్సిపాల్ దాడికి పాల్పడిన విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినప్పటికీ బుధవారం ఎవరూ రాకపోవడంతో దాడికి పాల్పడిన ఆదిత్య వర్ధన్‌రెడ్డి, ఇదాయత్ అలీ అనే ఇద్దరు విద్యార్థులను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ మంజునాథ్ తెలిపారు. కళాశాల క్రమశిక్షణ కమిటీ విచారణ పూర్తయ్యే వరకు తరగతులకు ల్యాబ్ లకు హాజరు కావద్దని తెలిపారు. ఈ విషయంలో కుకునూరు పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్టు ప్రిన్సిపాల్ వివరించారు.

గల్లీలు బాగుంటేనే పట్టణం బాగుంటుంది

- మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు



నవతెలంగాణ-సిద్దిపేట: రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు సూచనల మేరకు నేటి నుంచి స్వచ్ఛ సిద్దిపేట నిర్మాణంలో భాగంగా వార్డుల్లో ఉన్న ప్లాస్టిక్ చెత్తను ఏరి వేయడం జరిగిందని, గల్లీలు బాగుంటేనే పట్టణం బాగుంటుందని పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ అన్నారు. బుధవారం వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, డాక్టర్ శాంతి, కౌన్సిలర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్‌లు, జవాన్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి ఆయా వార్డులలో నడుచుకుంటూ చెత్తను తొలగించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన నడుచుకుంటూ చెత్త వేరు చేద్దాం అనే కార్యక్రమాన్ని పట్టణ మొదటి వార్డు లింగారెడ్డి పల్లి ఇందిరమ్మ కాలనీలో ఉదయం 6 గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కిరాణా సముదాయాల వ్యాపారస్థులతో మాట్లాడుతూ ప్రతి దుకాణం ప్రక్కన తప్పకుండా చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ ప్లాట్ లలో చెత్త పెరుకుపోవడాన్ని గమనించి చుట్టూ ప్రక్కల ఇండ్లలో ఉండే వారిని పిలిచి మందలించారు. ఓపెన్ ప్లాట్‌లలో చెత్త వేసే వారిని గుర్తించి, చెత్తను మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించే విధంగా వారికి సూచించాలని చెప్పారు. ప్రజలు తప్పకుండా చెత్తను మూడు రకాలుగా వేరు చేసి కేవలం మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బర్ల మల్లికార్జున్, రెడ్డి విజయేందర్ రెడ్డి, సాయన్న గారి సుందర్, నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, బంధారం రాజు, మొయిజ్, శ్రీనివాస్ యాదవ్, సానిటరీ ఇన్స్పెక్టర్‌లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె జయప్రదం చేయాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవి కుమార్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గ్రామ పంచాయతీ కార్మికులకు సమస్యల పరిష్కారం కోసం జులై 6 నుండి చేపట్టే నిరవధిక సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవి కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం హుస్నాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రవి కి సిఐటియు, కార్మిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జె.ఎ.సి. ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త చేపట్టే నిరవధిక సమ్మె కొనసాగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలలో 50 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారన్నారు. పేద, బలహీన వర్గాలకు చెందిన కార్మికులే నిత్యం మలినాలతో సహజీవనం చేస్తున్నారన్నారు. భారత రాజ్యాంగంలో ప్రభుత్వాలు ఉపాధి కల్పించాలని, స్థిరమైన వేతనాలు ఇవ్వాలని చెబుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో పాటు పంచాయతీలలో కొత్త కార్మికులను నియమిస్తూ సర్పంచ్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పంచాయతీలలో కొత్తగా కార్మికులను నియమిస్తే గ్రామ పంచాయతీ తీర్మానం, డి.పి.ఓ ఆమోదం తర్వాతనే ఈ నియామకాలను చేసి అక్రమ నియామకాలను అరికట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.51 తీసుకొచ్చి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ప్రభుత్వం వివిధ రకాల కేటగిరీలను రద్దుచేసి కారోబార్, బిల్ కలెక్టర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. సిబ్బందితో నైపుణ్యం లేని పనులు చేయించడంతో అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పేరుతో అట్టహాసంగా కార్యక్రమాలను ప్రారంభించి ఫొటోలకు ఫోజులిస్తూ యాడ్స్‌కు వేల కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేసిందన్నారు. బిజెపి 2వ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను పెట్టుబడిదారులకు కారుచౌకగా అమ్మేస్తుందన్నారు. కార్మికవర్గం ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేసిందన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఫిక్స్ టర్మ్, డైలీవేజ్ తదితర రకాల పేర్లతో ఉపాధి పొందుతున్న కార్మికుల శ్రమను యథేచ్ఛగా దోచుకునేందుకు కనీసవేతన చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు. పేదవాని కన్నీళ్ళు తుడవాల్సిన చేతులతో అరకొరగా ఉన్న విద్యా, వైద్యం తదితర సబ్సిడీలను రద్దు చేసిందన్నారు. అన్నదాతలకు కనీస మద్దతు ధరను నిర్ణయించడం లేదని, డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు ప్రజలు, ఇతర తరగతుల కార్మికవర్గం, ఉద్యోగులు సంఘీభావం తెలియజేసి అండగా నిలబడాలని సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్మికులు దుర్గయ్య, సమ్మయ్య, శ్రీకాంత్, లక్ష్మణ్, కనకయ్య, బాబు, కొమురయ్య, రాజవ్వ, నర్సవ్వ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పూటకో పార్టీ మారే కొమ్మూరికి ముత్తిరెడ్డిని విమర్శించే స్థాయి లేదు

- కొమ్మూరి ప్రతాపరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మద్దూరు

నిత్యం ప్రజాక్షేత్రంలో ఉన్న ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిని పూటకో పార్టీ మార్చే కొమ్మూరి ప్రతాపరెడ్డి విమర్శించడం తగదని, ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేనని తెలిసిన జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కుటుంబ సభ్యులైన అల్లుడు, బిడ్డలతో కొమ్మూరి ప్రతాపరెడ్డి అనేక ఆరోపణలు చేయించడం సరైనది కాదని, ఇలాంటి చర్యలు మానుకోవాలని మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి హెచ్చరించారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం, మద్దూరు, దూల్మిట్ట బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు మేక సంతోష్ కుమార్, మంద యాదగిరిలతో కలిసి ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ చేర్యాల అంగడి బజార్లో ఓ వ్యక్తి దగ్గర జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి 1200 గజాల ప్లాటు కొనుగోలు చేసి తన కూతురు పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఆ భూమి లీగల్‌గా ఉన్నట్లుగా కలెక్టర్, ఆర్డిఓ, తహసీల్దార్లు ధ్రువీకరించారని తెలిపారు, కావాలనే కొమ్మూరి ప్రతాపరెడ్డి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతాప్ రెడ్డి కి సీఎం కేసీఆర్ 2001లో నర్మెట జడ్పిటిసి టికెట్ ఇచ్చి, చేర్యాల ఎమ్మెల్యేగా గెలిపించారని, పార్టీ ప్రతిష్టను పక్కనపెట్టి ఆంధ్ర పాలకులకు అమ్ముడు పోయిన చరిత్ర కొమ్మూరిది అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు లేని వ్యక్తి కొమ్మూరి ప్రతాపరెడ్డి అని, సొంత పార్టీ కార్యకర్తలే అతనిపై దాడి చేసినా సిగ్గు లేదన్నారు. తన సొంత ఊరు నర్సాయపల్లి గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. సొంత తల్లిదండ్రులకు బుక్కెడు బువ్వ పెట్టలేదని ఆరోపించారు, గ్రామంలో వెంచర్ చేసి అనేక అక్రమాలకు పాల్పడ్డాడని, ఒక వెంచర్లో గ్రామానికి 970 గజాల భూమిని పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని సైతం అమ్ముకున్న చరిత్ర కొమ్మూరి ప్రతాపరెడ్డిది అని తెలిపారు. ప్రజాక్షేత్రంలో కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిపై కొమ్మూరి ప్రతాపరెడ్డి విమర్శలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి, సర్పంచులు జనార్దన్ రెడ్డి, జీడి కంటి సుదర్శన్, గంగి భాగ్యలక్ష్మి శ్రీనివాస్, బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఎంపీటీసీ గుజ్జుల సమ్మయ్య, దూల్మిట్ట మండల ఉపాధ్యక్షుడు ఇమ్మడి సంజీవరెడ్డి ,నాయకులు బూరుగు నర్సింలు, రాచకొండ సాయిలు, బోయిని మనోహర్, పిడిశెట్టి గౌరీషా, సోషల్ మీడియా మండల కన్వీనర్ రఘు ,పాల్గొన్నారు

గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమ్మె నోటీసు

- జేఏసీ జిల్లా కో కన్వీనర్ తునికి శ్రీకాంత్



నవతెలంగాణ-సిద్దిపేట రూరల్

తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగుల, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నారాయణరావుపేట మండల పరిషత్ ఎంపీడీవో కార్యాలయంలో, గ్రామ పంచాయతీ కార్యదర్శి కిషన్ రావుకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా జేఏసీ జిల్లా కో కన్వీనర్ తునికి శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. పీఆర్సీలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం పంచాయతీ సిబ్బందికి రూ.19 వేలు చెల్లించాలన్నారు. ఆలోపు జీవో నెంబర్ 60లో పేర్కొన్న వేతనాలను కేటగిరివారీగా పంచాయతీ సిబ్బందికి నెలకు రూ.15,600, పంప్ ఆపరేటర్లు ఎలక్ట్రీషన్లు డ్రైవర్లు, కారోబార్ బిల్ కలెక్టర్‌కు, ఇతర స్కేల్ సిబ్బందికి రూ.19,500 చెల్లించాలన్నారు. కారోబార్ బిల్ కలెక్టర్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పాత పద్ధతిలోనే వివిధ కేటగిరీలను యధావిధిగా కొనసాగించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. దీని అమలు పోస్టాఫీస్ బీమా పథకం ద్వారా చెల్లించాలన్నారు. పిఎఫ్, ఈ.ఎస్.ఐ, ప్రమాదబీమా, గ్రాట్యుటీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు రూ.30 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు బాలు,నరేష్, రాజలింగం, పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ ద్రోహి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

- ఏఎంసి చైర్మన్ మల్లేశం, ఎంపీపీ కరుణాకర్



నవతెలంగాణ-చేర్యాల:

తెలంగాణ ఉద్యమాన్ని ఆంధ్ర పాలకుల కాళ్ల వద్ద తాకట్టు పెట్టిన ఉద్యమ ద్రోహి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయం మార్కెట్ యార్డ్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిని నోటికి వచ్చినట్లు విమర్శించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇకనైనా ప్రతాప్ రెడ్డి పద్ధతి మార్చుకోకుంటే గ్రామాల్లో అడుగుపెట్టనీయమని హెచ్చరించారు. ఆడబిడ్డను అడ్డం పెట్టుకుని ప్రతాప్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నాడని తెలిపారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉంటాయి కానీ ఎమ్మెల్యే కుటుంబంలో వారిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేసే నీచ సంస్కృతి ప్రతాప్ రెడ్డిది అని విమర్శించారు. పూటకో పార్టీ మార్చే ప్రతాప్‌రెడ్డి ఏ పార్టీ నుండి పోటీ చేస్తాడో ముందు ప్రజలకు తెలపాలన్నారు. రాబోయే రోజుల్లో చేర్యాల ప్రాంత ప్రజలు ప్రతాప్ రెడ్డికి దిమ్మతిరిగే షాక్ ఇస్తారని, మూడోసారి ముచ్చటగా ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బుట్టి ఆగమల్లు, జిల్లా రాజేశం, బాసెట్టి బుచ్చి రాములు,శనిగరం సత్యనారాయణ, భీమరాజు, ఉమామహేశ్వర్, మెరుగు కృష్ణ,తాటికొండ సదానందం, టిఆర్ఎస్ యూత్ నాయకులు ఆకుల రాజేష్, తాండ్ర సాగర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈఓకు వినతిపత్రం



నవతెలంగాణ-కొండపాక

విద్యాశాఖ అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి చేర్యాలలో శ్రీచైతన్యను నడిపిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా పుస్తకాలతో వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. అంగడి సరుకుల వలె పుస్తకాలను, టై, బెల్ట్ పుస్తకాలతో వ్యాపారం చేస్తూ జీవో 1ను తుంగలో తొక్కుతూ ఎలాంటి పర్మిషన్ లేకుండా స్కూల్‌ను నడిపిస్తున్నారని తెలిపారు. వెంటనే స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ ముందు నిరసన దీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు స్వాధీనం చేసుకున్న ఎంపీడీవో



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మేజర్ గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పరశురాం గత 40 రోజుల నుంచి విధులకు రావడం లేదని గ్రామపంచాయతీ ఈవో హరిప్రసాద్ ఎంపీడీవో శ్రీనివాస వర్మకు సమాచారం ఇచ్చారు. విధులకు హాజరు కావాలని పలుమార్లు సెల్ ఫోన్ ద్వారా ఎంపీడీవో శ్రీనివాస్ వర్మ చెప్పారు. బిల్ కలెక్టర్ పట్టించుకోకపోవడంతో నోటీసులు పంపించినట్లు తెలిపారు. వాటికీ స్పందించక పోవడంతో ఎంపీడీవో బుధవారం బీరువా తాళం పగలగొట్టి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గ్రామపంచాయతీలో పాలనలో రికార్డు సమస్యలు ఏర్పడిందని ఆ సమస్యలను పరిష్కరించేందుకు బుధవారం నాడు ఎంపీడీవో శ్రీనివాస వర్మ ఆర్ఐ నాగరాజు, కారోబార్ బాలయ్య, నాయకులు బంగ్లా శ్రీనివాస్ రెడ్డి, వార్డు మెంబర్ మచ్చ గణేష్ ఆధ్వర్యంలో బీరువాను పగలగొట్టి అందులో ఉన్న రికార్డులను ఎంపీడీవో స్వాధీనపర్చుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొండపాకలో రాష్ట్రకూట శైలి సరస్వతీ విగ్రహం



నవతెలంగాణ-కొండపాక

కొండపాకలో పోచమ్మగుడి దగ్గర సరస్వతీ శిల్పాన్ని గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధక సభ్యులు కొలిపాక శ్రీనివాస్, అహోబిలం కరుణాకర్, ఎండి నసీర్, సామలేటి మహేశ్ బుధవారం గ్రామంలో విగ్రహాన్ని కనుగొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ విగ్రహానికి సంబంధించిన విషయాలను వెల్లడించారు. కొండపాక చారిత్రకంగా ప్రసిద్ధమైన గ్రామమని, చారిత్రక పూర్వయుగం నుంచి చరిత్రయుగం దాక అపురూపమైన పురావస్తువులు, శిల్పాలు, శాసనాలు లభించిన గ్రామన్నారు. సరస్వతీ శిల్పాలు తెలంగాణాలో పలుచోట్ల లభించాయని, అందులో కొలనుపాక, నందికంది, వేల్పుగొండ, వరంగల్, బాసరలలో కొత్త సరస్వతీ విగ్రహాలను కొత్త తెలంగాణ చరిత్రబృందం గుర్తించిందన్నారు. కొండపాకలో లభించిన విగ్రహం చతుర్భుజియైన సరస్వతీ నిజహస్తాలలో అక్షమాల, పుస్తకం, పరహస్తాలలో అంకుశం, పాశాలున్నాయని తెలిపారు. ఆసనస్థితిలో ఉన్న దేవత, వివిధ ఆభరణాలతో అలంకృతమై వున్నదన్నారు. జైనంలో సరస్వతిని శ్రుతదేవి అంటారు. క్రీ.పూ.3వ శతాబ్దానికి చెందిన జ్ఞాన సరస్వతి శిల్పం మధురలో శాసనంతో లభించిందని కొలనుపాకలో ఉన్న సరస్వతి శిల్పాన్ని శ్రుతదేవి అంటారన్నారు. కొండపాకలో లభించిన సరస్వతి శిల్పం కూడా బాసరలో లభించిన జ్ఞాన సరస్వతిని పోలివుందన్నారు.

లోహిత్‌సాయి హాస్పటల్‌లో అత్యంత అరుదైన శస్త్ర చికిత్స



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని లోహిత్ సాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో బుధవారం డాక్టర్లు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. లోహిత్ సాయి ఆసుపత్రి చైర్మెన్, లాప్రో, జనరల్ సర్జన్ డాక్టర్ అమిరిశెట్టి భాస్కర్ మాట్లాడుతూ 25 సంవత్సరాల పెళ్లికాని యువతి గర్భసంచి నుంచి 19 సెం మీల పొడవైన గడ్డ ని తొలగించినట్లు తెలిపారు. గర్భసంచికి ఎలాంటి నష్టం రాకుండా, పెళ్లి అయ్యాక సంతానం కలిగేలా ముగ్గురు డాక్టర్ల బృందం 4 గంటలు కష్టపడి యువతీ కడుపులోని గర్భసంచికి సంబంధించిన గడ్డ తొలగించినట్లు తెలిపారు. ఇలాంటి ఫైబ్రాయిడ్ గడ్డలు పెళ్లి కాని యువతులకు అరుదుగా వస్తాయని, కడుపు లోపల ఏదైనా కంతి మాదిరిగా అనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించి, ముందుగానే గురిస్తే ఇంత తీవ్ర సమస్య కాకుండా చూడొచ్చని తెలిపారు. ప్రస్తుతం పేషెంట్ ఆరోగ్యాంగా ఉందని, ఐసీయూ లో ఉంచి చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

దౌలాపూర్‌లో నూతన బస్సు సర్వీస్ ప్రారంభం



- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామంలో నూతన బస్సు సర్వీసును సర్పంచ్ యాదలక్ష్మి శ్రీనివాసరెడ్డి, గజ్వేల్ ఏఎంసీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ఉండాలని సీఎం కేసీఆర్ సూచించారన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులను తొలగించడానికి బస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బస్సు సేవలు వినియోగించుకోవాలి అన్నారు. అదేవిధంగా బస్సు సర్వీస్ కొండపోచమ్మ నుంచి చాట్లపల్లి వట్టిపల్లి, బస్వాపూర్, పలుగడ్డ మాదాపూర్ మునిగడప గొల్లపల్లి దౌలాపూర్ మీదుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వరకు బయలుదేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్, ఇటిక్యాల సుధాకర్ రెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మస్కూరి చంద్రయ్య, ఆకారం నర్సింలు , మంజె ముత్యాలు,వంటేరు దేశమంతా రెడ్డి, ఇరమైన మైసయ్య, కేశమైన నర్సింలు, ఎండి.అన్వూ, పోశవ్వ, మంగలి రవి,కమ్మరి రవి, ఆకారం యాదయ్య పాల్గొన్నారు.

తల్లీబిడ్డకు రక్షణ సీఎం కేసీఆర్

- ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా కృషి
- దేశానికి ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం
- జెడ్పీ చైర్మన్ వేలేటి రోజు రాధాకృష్ణశర్మ



నవతెలంగాణ-తొగుట: ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు అనే సామెత ఉందని, నేడు పేదింటి వధువు పెళ్లికి కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకం ఎంతో భరోసా ఇస్తుందని జెడ్పీ చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ పేర్కొన్నా రు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 15 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రఘునందన్ రావు, ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆధ్వర్యంలో ప్రజారోగ్యంకు పెద్దట వేస్తున్నారన్నారు. నేడు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవా లు పెరుగుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. చిన్న పాప నుండి బాలింత వరకు ఆరోగ్యం, పౌష్టి కాహారం, ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని, తెలంగాణలో జరిగిన అభివృద్ధి దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గ్రామ గ్రామాన పార్కులు, నర్సరీలు, డంప్ షెడ్లు, స్మశాన వాటికలు, మరుగు దొడ్లు, ఇంటింటికి తాగునీటి సరఫరాతో గ్రామీణ ప్రాంతాల దశ మారిపోయిందన్నారు. ఎమ్మెల్సీ డా.వంటేరు యాదవ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేతఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గాంధారి లత నరేందర్ రెడ్డి, సొసైటి చైర్మన్ కె. హరికృష్ణా రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఎంపీడీవో శ్రీధర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి ,మాజీ మండల పార్టీ అధ్యక్షులు చిలువేరి రాంరెడ్డి,మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు సిరినేని గోవర్ధన్ రెడ్డి,ఎంపీటీసీ ల ఫోరం కంకణాల నర్సింప Q\T,ఎంపీటీసీలు సుతారి లలిత, వేల్పుల స్వామి,సర్పంచులు ఎం ప్రేమల చంద్రారెడ్డి,బొడ్డు నర్సింలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

28వ వార్డ్ కమిటీ విద్యార్థి ఆత్మీయ సమేళనం

నవతెలంగాణ-సిద్ది పేట



మంత్రి హరీశ్ రావు సూచనలతో 28వ వార్డు కమిటీ విద్యార్థి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్లు బీఆర్ఎస్వి పట్టణ అధ్యక్షుడు గరిపల్లి మహిపాల్ గౌడ్, 28వ వార్డ్ కౌన్సిలర్ కలకుంట్ల మల్లికార్జున్‌లు తెలిపారు. మంత్రి హరీశ్ రావు ఆధ్వర్యంలోనే అనేక కొత్త ఉద్యోగ నోటిఫికేషన్‌లు వస్తున్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తుకు భరోసాను ఇచ్చే బీఆర్ఎస్ వైపే ప్రతి ఒక్కరం నిలవాలన్నారు. నూతన కమిటీ 28వ వార్డ్ అధ్యక్షుడిగా శాహేబాజ్ ఖాన్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు చాంద్, మాజీ ఏఎంసి డైరెక్టర్ బాబు జానీ, సంజీవ్, అయూబ్ ఖాన్, పాషా ఆహ్మద్, అమీర్ అలీ, కర్ణాకర్, షబ్బీర్, ఫురఖాన్, నజీర్ , ఇరుగంటి రమేష్, రాము, కర్రోళ్ల సతీష్, నరేష్ , బసంపల్లి నాగరాజు, శ్రీను, కోడూరి శ్రీనివాస్, రమేష్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బక్రీద్ ఖుర్బాని ముబారక్ క్యాన్వాస్ చిత్రం ఆవిష్కరించిన చిత్రకారులు రుస్తుం

నవ తెలంగాణ - సిద్ది పేట



బక్రీద్ పండుగను పురస్కరించుకుని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో బుధవారం బక్రీద్ ఖుర్బాని ముబారక్ క్యాన్వాస్ చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సమాజంలో నిస్తేజాన్ని తొలగించి జీవితాలను కళావంతం చేస్తాయని అన్నారు. బక్రీద్ ఈదుల్ జుహ పర్వదినం త్యాగానికి, సహనానికి ప్రతీక అనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీంరుస్తుం, గ్రేట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబినారుస్తుం, రహీమ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా పెద్దొల్ల శ్రీనివాస్

నవతెలంగాణ-బెజ్జంకి



బీఎస్పీ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా పెద్దొల్ల శ్రీనివాస్ యాదవ్ నియామకమయ్యారు. కరీంనగర్ జిల్లా బీఎస్పీ జిల్లాధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్ బుధవారం శ్రీనివాస్ యాదవ్‌కు నియామకపత్రం అందజేశారు. బీఎస్పీ రాష్ట్రాధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీన్ కుమార్ సారథ్యంలో బీఎస్పీ పార్టీని మరింత బలపర్చి బహుజన రాజ్యాధికారం కోసం శాయశక్తుల కృషి చేస్తానని, తనపై నమ్మకంతో కరీంనగర్ జిల్లా బీఎస్పీ కార్యవర్గ సభ్యుల నియామకానికి సహకరించిన జిల్లా, నియోజవర్గ, మండల బీఎస్పీ నాయకులకు శ్రీనివాస్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ ఇసుక నిల్వల స్వాదీనం

నవతెలంగాణ-బెజ్జంకి



తహసిల్దార్ విజయ ప్రకాశ్ రావు ఉత్తర్వుల మేరకు మండల పరిదిలోని గాగీల్లపూర్ గ్రామ శివారుల్లో అక్రమ ఇసుక నిల్వలను బుధవారం స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.మూడు అక్రమ ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నామని రెవెన్యూశాఖ,పోలిస్ శాఖాధికారులు తెలిపారు.ఎస్ఐ ప్రవీన్ రాజు, రెవెన్యూశాఖ ఆర్ఐ రాజయ్య,అయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

గత కొద్ది నేలలుగా అధికారుల కళ్లముందే రాత్రింబవళ్లు అక్రమ ఇసుక రవాణ జోరుగా సాగుతున్న బుధవారం అధికారులు తుతూ మంత్రంగా సోదాలు నిర్వహించి అక్రమ ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకోవడం విడ్డూరంగా ఉందని గాగీల్లపూర్ గ్రామంలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ ఇసుక రవాణకు అనువుగా ఉన్న వేసవికాలం రోజుల్లో అధికారులు అలసత్వం వహించి చట్టపరమైన చర్యలు చేపట్టకుండా వానకాలంలో అక్రమ ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకోవడం తమ ఉనికిని చాటుకోవడానికేనని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాను ఆరికట్టడానికి సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి భారీ గుంతలేర్పాటు చేసిన రవాణదారులు మరో అక్రమ మార్గం ఏర్పాటుచేసుకుని ఇష్టానుసారంగా ఇసుక రవాణ సాగించారని, అధికారుల అండదండలతోనే ఇసుక అక్రమ రవాణ జోరుగా సాగించారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఇసుక దోపిడిదారులపై కఠిన చర్యలు చేపట్టాలని గాగీల్లపూర్ గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయులు కరువయ్యారు

నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ మండల్ సంగాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేరని బుధవారం డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు ఆరోపించారు. 111 పదిమంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండడం, అందులో హెడ్మాస్టర్ పది రోజుల నుంచి స్కూలుకి రాకపోవడంతో బడికి వచ్చి చదవాల్సిన పిల్లలు రోజంతా ఆట పాటలతో రోజంతా గడిచిపోతుందని మండిపడ్డారు. వెంటనే సంగాపూర్ స్కూల్‌కి పిల్లలకు సరిపడే ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్

జడ్పీ చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ

నవతెలంగాణ-తొగుట

రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తూ చరిత్రలో నిలిచిపోయారని జడ్పీ చైర్మన్ వేలేటి రోజు రాధా కృష్ణశర్మ పేర్కొన్నారు.బుధవా రం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యం లో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి ఎమ్మెల్సీ డా.యాదవ రెడ్డితో కలిసి పాలాభిషేకం చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు పంట పెట్టుబడి కోసం 11వ విడత రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో విడుదల చేయడం హర్షించ దగ్గ విషయం అన్నారు.గత ప్రభుత్వాల ఆధ్వర్యంలో పంట పెట్టుబడుల కోసం రైతులకు పెద్ద ఎత్తున సమస్యలు ఎదురయ్యేవని, నేడు రైతు బంధు పథకం ద్వారా సీఎం కేసీఆర్ వారికి భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి తన్నీరు హరీశ్ రావుల ఆధ్వర్యంలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడంతో సాగునీటి గోస తీరిందన్నారు. కరువు కాటకాలతో ఉన్న తెలంగాణ నేడు పచ్చని పంటలతో పంజాబుకు దీటుగా దిగుబడులు సాధిస్తూ రాష్ట్రం ధాన్యాగారంగా మారిందన్నారు.

రైతు బంధు దేశానికే ఆదర్శం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి



రైతులకు పెట్టుబడి సహాయం కింద తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రైతు బంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్సీ డా. వంటేరు యాదవరెడ్డి పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా రైతుల ఖాతాల్లోకి రూ. 75 వేల కోట్లను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణలో 24 గంటల ఉచిత కరెంటు, సాగునీటి కల్పన, సమయానికి ఎరువులు, విత్తనాలు, రైతు బంధు, రైతు బీమా పథకాల తో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కె. హరికృష్ణారెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి,సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చిలువేరి రాంరెడ్డి, మండల సర్పంచ్ ల ఫోరం సిరినేని గోవ ర్ధన్ రెడ్డి,మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కంకణాల నర్సింహులు, సర్పంచ్లు బొడ్డు నరిసిం హులు, ప్రేమల చంద్రరెడ్డి, ఎంపీటీసీ సుతారి లలిత రమేష్, వెల్పుల స్వామి, మండల యూత్ అధ్య క్షులు మాదాసు అరుణ్ కుమార్,ఉపాధ్యక్షులు పాశికంటి వికాస్,లింగంపేట గ్రామ పార్టీ అధ్యక్షులు అబీద్ హుస్సేన్ పాటు మండలంలోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను బదిలీ చేయడంపై కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే

నవ తెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హనుమకొండ జిల్లాలోని వేలేరు మండలంలోని కన్నారం ఎర్రబెల్లి గ్రామాలను భీమదేవరపల్లి, అక్కన్నపేట మండలలో కలుపుతూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఎర్రబెల్లి గ్రామాన్ని భీమదేవరపల్లి మండలానికి, కన్నారం గ్రామాన్ని సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

నవ తెలంగాణ-దౌల్తాబాద్ : జూలై 2,3,4 న కాంగ్రెస్ పార్టీ నిర్వహించే రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ పోటీల్లో యువకులు పాల్గొని విజయవంతం చేయాలని విద్యార్థిని విద్యార్థులను తాజా మాజి ఎంపీటీసీ మద్దెల స్వామి, దౌల్తాబాద్ తాజ మాజీ సర్పంచ్ ఆది వేణు గోపాల్ తెలిపారు. రాష్ట్రంలో యువత నిరుద్యోగంతో బాధపడుతున్న యువతకు ప్రోత్సహించే విధంగా ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధీ ఆధ్వర్యంలో యూత్ నిరుద్యోగ డిక్లరేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ పోటీలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆన్లైన్లో కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దొమ్మాట గ్రామ అధ్యక్షుడు స్వామి రవి తదితరులు పాల్గొన్నారు

ఆయిల్ ఫామ్ తోట సాగుతో రైతుల అభివృద్ధి

నవతెలంగాణ-మర్కుక్

మారుతున్న పరిస్థితులను బట్టి రైతులు ఆయిల్ ఫామ్ తోటల సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించ వచ్చుని మర్కుక్ వ్యవసాయాధికారి డా. టి. నాగేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వరదరాజు పూర్ గ్రామంలో వెంకట్ శ్రీవాస్తవ సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ తోటలను అయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ చట్టము 1993 ద్వారా ఆయిల్ ఫామ్ రైతులకు ప్రయోజనాల పరిరక్షణ కల్పించడం జరుగుతుందని గెలలు కొనుగోలులో దళారి వ్యవస్థ లేదు, నేరుగా ప్రభుత్వ రంగ సంస్థ నే రైతులు పండించిన ఆయిల్ ఫామ్ గెలలను కొనుగోలు చేస్తుందన్నారు. ఖచ్చితమైన మార్కెట్ వ్యవస్థ ఆయిల్ ఫామ్ రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో నగదు చెల్లింపులు జరుగుతాయన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సుమారు 3.66 లక్షల టన్నుల పాము ఆయిల్ అవసరం కాగా, ప్రస్తుతం 39,346 టన్నులు మాత్రమే ఉత్పత్తి జరుగుతుందని ఈ కొరతను అధిగమించడానికి 2.5 లక్షల ఎకరాల ఆయిల్ ఫామ్ సాగుల్ చేయవలసి ఉన్నదని తెలియజేశారు. ఆయిల్ ఫెడ్ అధికారి విజయ్,వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణు వర్ధన్, రైతులు ,తదితరులున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-దుబ్బాక

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ దుబ్బాక యూనిట్ అధ్యక్షుడు రఘు రామకృష్ణ తెలిపారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో జరిగిన తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్ రెడ్డిలు ముఖ్యాతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో చర్చించి ఎన్నికలు నిర్వహించడం జరిగింది. దుబ్బాక యూనిట్ అధ్యక్షులుగా రఘురామకృష్ణ, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులుగా పరమేశ్వర్, కోశాధికారిగా శ్రీనివాస్‌లను నియమించడం జరిగింది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి మొదటి పిఆర్సిలో 43 శాతం, రెండో పిఆర్సిలో 30 శాతం సాధించిన ఘనత టీఎన్జీవో సంఘానిదేనని, ఉద్యోగులందరు కలిసికట్టుగా ఉందామని కోరారు. పలు శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.

అవాలతో చిత్రించిన విష్ణు భగవాన్ చిత్రం అద్భుతం

నవ తెలంగాణ- గజ్వేల్

శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో తొలి ఏకాదశి సందర్భంగా అవాలతో విష్ణు భగవాన్ చిత్రాన్ని బుధవారం ప్రగతి స్కూల్‌లో విష్ణు భగవాన్ చిత్రాన్ని పూజించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందువులు పవిత్రంగా నిర్వహించుకునే పండుగలలో తొలి ఏకాదశి పండుగ ఒకటి. తొలి ఏకాదశి రోజున భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్ష చేస్తారన్నారు. రామకోటి రామరాజు ఎన్నో చిత్రాలను ఎన్నో రకాలుగా చిత్రించి తద్వారా సమాజాన్ని ఒక సందేశాన్ని ఇవ్వడం అతకే సాధ్యం. తొలి ఏకాదశి సందర్భంగా అవాలతో విష్ణు భగవంతుని చిత్రాన్ని 3రోజులు శ్రమించి చిత్రించడం ఆయన భక్తికి నిదర్శనం. భక్తిని ఇలా కూడా చాటుకోవవడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజును ఏసీపీ ప్రత్యేకంగా సన్మానించి అభినందిచారు. ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ అంబాదాస్, ప్రిన్సిపాల్ రహమత్, పిటి లక్ష్మణ్, కొక్కొండ శ్రీనివాస్, వేములవాడ కనకచారి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ మహేందర్‌కు బీఆర్ఎస్ నాయకుల సన్మానం

నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్ ఇటీవలే సీఐగా పదోన్నతి పొందిన సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం పలువురు బిఆర్ఎస్ నాయకులు ఎస్సై మహేందర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే ఆయన జన్మదిన సందర్భంగా కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఆయన మరెన్నో ఉన్నత పదవులను చేపట్టాలని జడ్పిటిసి కడ్తాల రవీందర్ రెడ్డి ఆకాంక్షించారు. బిఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి,మండలాధ్యక్షుడు బాణాల శ్రీనివాస్,సీనియర్ నాయకులు కోమటిరెడ్డి రాధా మనోహర్ రెడ్డి,సంఘపు ప్రభాకర్, పలువురున్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని చేబర్తి గ్రామా మాజీ ఉప సర్పంచ్ శమ్మని కిష్టయ్య (70) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎర్రబాగు రఘుపతి పెద్ద కుమారుడు సాయి కిషన్ (24) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బుధవారం సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండల అధ్యక్షులు కనకయ్య గౌడ్, ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి, యూత్ అధ్యక్షులు నర్సింలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిష్టయ్య, ఆంజనేయులు,తదితరులున్నారు.

బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ కలలు అవిరయ్యాయి

నవతెలంగాణ-బెజ్జంకి

నీళ్ల, నిధులు, నియామకాల కోసం ప్రజలు చేసిన పోరాటాలు, అమరుల త్యాగాలు, అకాంక్షలను నెరవేర్చాలనే సదుద్ధేశ్యంతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలనలో రాష్ట్ర ప్రజల కలలు అవిరయ్యాయని కరీంనగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జీ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కవ్వంపల్లి సత్యనారాయణ హజరై పలువురు బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడారు.కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన అనంతరం అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాభిష్టాల్ని విస్మరిస్తూ వారి స్వార్థ రాజకీయ అధికార లబ్దికోసం రాష్ట్ర సాధన లక్ష్యాన్ని నీరుగార్చి.. అభివృద్ధి పేరుతో ప్రజాధనం దోపిడీ చేయడమే ప్రధాన ధ్యేయంగా పరిపాలన సాగిస్తుందన్నారు. దళిత బందు, బీసీ సహయం వంటి పథకాలతో మరోసారి ప్రజలను మభ్యపెట్టి అధికారం కోసం పాకులాడుతున్నాడని అసహనం వ్యక్తం చేశారు. మళ్లీ అధికారం కోసం సామాన్యుల ఓట్లే కీలకమని గ్రహించిన సీఎం కేసీఆర్ రాబోయే ఎన్నికల్లో మరెన్నో పథకాలతో ముందుకు వచ్చి ప్రలోభాలకు గురిచేస్తాడని ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర సమాజం మెల్కోని అంబేడ్కర్ రాజ్యాంగం ద్వార లబించిన వజ్రాయుధమైన ఓటును సద్వినియోగం చేసుకుని బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ప్రధాన కర్తవ్యంగా పనిచేసే కాంగ్రెస్ పార్టీ పాలనకు పట్టం కట్టాలని కోరారు.మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, నాయకులు పులి కృష్ణ, శానగొండ శ్రావణ్,రొడ్డ మల్లేశం, జనాగం శంకర్,మాజీ యువజన మండలాధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్,కార్యకర్తలు హజరయ్యారు.

సత్య సూర్య కంపెనీ కార్మికులకు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మద్దతు

నవ తెలంగాణ -గజ్వేల్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సత్య సూర్య పరిశ్రమ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి రెండో రోజుకు చేరింది. ఈ సమ్మెకు మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం వెంటనే యజమానిపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలతో కార్మికుల కుటుంబాలు ఏ విధంగా గడుస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో కార్మిక చట్టాల ఉల్లంఘనకు పాల్పడితే మిగతా ప్రాంతాల పరిస్థితి ఏంటని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని యజమాన్యంతో మాట్లాడి వేదన ఒప్పందం జరిగేలా ఒత్తిడి చేయాలన్నారు. లేనిపక్షంలో కార్మిక కుటుంబాలతో కలిసి ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. పరిశ్రమలో యాజమాన్యం కార్మికులను అసభ్య మాటలతో వేధిస్తోందన్నారు. కనీసం మంచి నీటి సౌకర్యం కూడా అందుబాటులో ఉండదని, వ్యక్తిగతంగా పిలిచి లెటర్లు ఇస్తామంటూ ఆ కారణంగా యాజమాన్యం కక్ష సాధింపు చర్యలు చేస్తూ చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతోందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు యూనియన్ అధ్యక్షులు సంద బోయిన ఎల్లయ్య మాట్లాడుతూ వేతన ఒప్పందం వెంటనే చేయాలన్నారు. సమ్మె పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, పరిశ్రమ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్, రవి రాజ్ అశోక్ సద్దాం సుధాకర్ నరేష్ రాజు జయమ్మ ఊర్మిళా వసంత భాగ్యమ్మ ఈశ్వరమ్మ ముత్యాలు విజయ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఆశా కార్యకర్తల ఎంపిక

నవతెలంగాణ మద్దూరు

మండలంలోని లద్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలోని కొండాపూర్ ,బెక్కల్ ,లద్నూర్ ,గ్రామాలలో మూడు ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయడంలో పారదర్శకంగా ఉంటుందని మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి తెలిపారు, ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను డాక్టర్ స్టూవార్సన్ పరిశీలించారు, అనంతరం జన ఆరోగ్య సమితి కమిటీ సమావేశానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆశ కార్యకర్తల పోస్టుల భర్తీలో ఎలాంటి అవకతవకలు జరగవని పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని ఆయన తెలిపారు, ప్రతి గ్రామం నుండి ముగ్గురిని ఎంపిక చేసి జిల్లా డి ఎం అండ్ హెచ్ ఓ కు అభ్యర్థుల జాబితాను పంపిస్తామని ఆయన తెలిపారు ,అక్కడ నుండి వారే ఆశ కార్యకర్తను ఎంపిక చేసి పంపిస్తారని ఆయన తెలిపారు ,ఈ కార్యక్రమంలో సర్పంచ్ జీడి కంటి సుదర్శన్ ,పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఎంపీటీసీ గుజ్జుల సమ్మయ్య, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ కాసర్ల కనకరాజు, వైద్య సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు

నరేష్ కుటుంబానికి పదివేల ఆర్థిక సాయం.

నవతెలంగాణ- గజ్వేల్: బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నరేష్ కుటుంబానికి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ రూ 5000. గజ్వేల్ మండలం బయ్యారం సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి 5000.00 ఆర్థిక సాయం అందించారు. గజ్వేల్ మండలంలో మిగతా పార్టీ నాయకులు ఇతర కార్యకర్తలు నరేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు.. మండలంలో పెద్ద పెద్ద పదవులు పొందిన నాయకులు ఉన్నారని పార్టీ కార్యకర్తలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నరేష్ కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని వారిద్దరు కూడా ఆడపిల్లలని వారు తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వం మీద అన్ని విధాల ఆదుకోవాలని వారు కోరారు. మంత్రి హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

దేశ్ ఫాండే ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో దేశ్ ఫాండే సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులచే స్కిల్ ఇన్ విలేజ్ అనే ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంగ కురుమ,ఎంపీటీసీ ఏటి తులసి- పరమేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు. ఎస్ఐవి ప్రతినిధులు ఏటి రేణుక, గంధమల్ల యాదగిరి ,పాలమాకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ట్యాబ్ ల పంపిణీ

నవతెలంగాణ-నంగునూరు: నంగునూరు మండల వనరుల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు 29 ట్యాబ్ లను పంపిణీ చేశారు. మండల విద్యాధికారి దేశి రెడ్డి మాట్లాడుతూ ఈ ట్యాబ్ ఉపయోగించే విద్యార్థుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడానికి ఉపయోగపడుతుందని విద్యార్థులకు ఆన్లైన్ పాఠాలను బోధించడానికి దోహదం చేస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మనీష్ కుమార్, భాస్కర్ రెడ్డి, మహేశ్వరి, వీరారెడ్డి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రజిత, సీఆర్పీలు పెంటయ్య, మోహన్ బాబు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బెజ్జంకి

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామంలో నేడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని బుధవారం బీఎస్పీ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బోనగిరి ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు.అంబేద్కర్ విగ్రహావిష్కరణకు బీఎస్పీ రాష్ట్రాధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని నియోజకవర్గంలోని బీఎస్పీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ప్రభాకర్ కోరారు.

బీడు భూముల్లో వ్యవసాయం చేయాలనేది కాంగ్రెస్ లక్ష్యం

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

బీడు భూములలో రైతులు వ్యవసాయం చేసుకోవాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం హుస్నాబాద్లో ప్రాజెక్టులను నిర్మించేందుకు పనులు ప్రారంభించిందని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి హుస్నాబాద్ ప్రాంత రైతులకు సాగునీరు అందించే ప్రక్రియ వేగవంతం చేస్తే ఇబ్బంది లేకుండేదన్నారు. ప్రాజెక్టు పరిధిలోని సమస్యలు పరిష్కారం



చేయకుండా భూ నిర్వాసితుల ఆంక్షలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రాజెక్టు నింపితే కింది పొలాలకు నీరు అందించే నెట్వర్క్ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. గండిపల్లి ప్రాజెక్ట్ కాల్వలు, గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వల ప్రక్రియలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. సిద్దిపేటలో హుస్నాబాద్ అంతం అన్ని రంగాలలో నిర్లక్ష్యానికి గురవుతుందన్నారు. 2023లో బీఆర్ఎస్ కాలం ముగిస్తుందని, 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి బహిరంగంగా ప్రజల ముందు చూపెట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు లింగ మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంక చందు, అక్కన్న పేట మండల అధ్యక్షులు జంగ పల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

నవ తెలంగాణ- గజ్వేల్

తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డక ఇంటికో ఉద్యోగం నిరుద్యోగ భృతి ఇస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శివసేన రెడ్డి గజ్వేల్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తారీఖు నాడు యూత్ సందేశ యాత్ర పేరుతో నిర్వహించబోయే బస్సు యాత్రను గజ్వేల్ నుండి ప్రారంభించబోతున్నాము, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వంత నియోజకవర్గం గజ్వేల్ యాత్ర ప్రారంభిస్తున్నాము ఈ యూత్ సందేశ యాత్రలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరుచున్నాము, తెలంగాణ రాష్ట్రంలో రైతులను నిరుద్యోగులను మోసం చేసాడు, తెలంగాణ రాష్ట్రంలో మూడున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి.నోటిఫికేషన్ల పేరుతో నిరుద్యోగుల నుండి లక్షలలో ఫీజులు వసూలు చేస్తున్నారు, మహిళ కానిస్టేబుల్ నియమకంలో యూత్ కాంగ్రెస్ పెద్ద సంఖ్యలో ఉద్యమం చేస్తే గర్భిణీలకు ఈవెంట్స్ రద్దు చేశారు,2018 మేనిఫెస్టో లో పొందు పర్చిన నిరుద్యోగ భృతి మూడువేల వదహారు రూ నిరుద్యోగులకు ఇవ్వకుండా ఎలాగో తుంగలో తొక్కరో తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి డిగ్రీ ఇంటర్ పాసైన విద్యార్థులకు తెలంగాణ ముఖ్యమంత్రి లక్ష 60 వేల రూపాయలు బాకీ ఉన్నాడు మీకు, మూడు నాలుగు మాసాల్లో ఎలక్షన్లు రానున్నట్లు అని చెప్పారు. ఎలక్షన్ ప్రచారాలలో భాగంగా మీ దగ్గరికి వచ్చే బిఆర్ఎస్ నాయకులను నిలదీసి అడగండి ముఖ్యంగా యువత మేల్కోవాలన్నారు. 2018లో నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ఇస్తానని చెప్పింది కాంగ్రెస్ పార్టీ దానిని కాపీ కొట్టి 2018లో మోసం చేసి ముడువేలపదహారు రూపాయలు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూసిన యువకులకు నిరాశ ఎదురయిందని చెప్పొచ్చు, అప్పులు చేసి హాస్టల్లో ఉండి చదువుకుంటూ నోటిఫికేషన్లు వస్తాయని ఎదురు చూసి తీరా ఉద్యోగ నోటిఫికేషన్లు రాకపోవడంతో ఎంతోమంది నిరుద్యోగ యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన మోసాలను యావత్ తెలంగాణ రాష్ట్రంలోని యువతకు అలాగే నిరుద్యోగులకు తెలపడం కోసమే యూత్ సందేశ యాత్ర పేరుతో బస్సు యాత్రను చేపడుతున్నామని తెలుపుతామన్నారు.

మహిళా సంఘం నిర్మాణానికి అదనపు నిధులు మంజూరి



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలోని మహిళా సంఘం పునర్నిర్మాణానికి జెడ్పీ చైర్పర్సన్ ఏలేటి రోజారాధశర్మ ఆధ్వర్యంలో రూ. 80 వేల నిధులను మంజూరి చేసినట్లు జెడ్పీటీసీ సుతారి శ్యామల మధుసూదన్రావు, ఎంపీటీసీ సుతారి కళ్యాణి కనకరాజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మంత్రి తన్నీరు హరీష్రావు మహిళా బిల్డింగ్ నిర్మాణానికి రూ.10 వేలు మంజూరి చేశారన్నారు. భవనం పూర్తికాకపోవడంతో జెడ్పీచైర్పర్సన్ దృష్టికి తీసుకుపోవడంతో అదనపు నిధులు మంజూరి చేశారన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్రావు, జెడ్పీ చైర్పర్సన్ రోజారాధశర్మ, ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో మాజీ శాసనసభ్యులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, అక్కన్నపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాండ్రాల దాము ,సింగిల్ విండో వైస్ చైర్మన్ భూపతి ముకుందా రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ బండి కుమార్ గౌడ్, అక్కన్నపేట టౌన్ అధ్యక్షులు చింతల మల్లారెడ్డి, బిసి సెల్ మండల అధ్యక్షుడు చింతల బాలరాజు, కిసాన్ మండల అధ్యక్షులు కొత్తకొండ పొడిశెట్టి,మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుగుర్తి బాలరాజు, బందారం శ్రీనివాస్, సంపత్ రెడ్డి,మాజీ సర్పంచ్ కాశబోయిన ఎల్లయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నకీర్తి మునిరాజ్,ఎండి అక్బర్, యూత్ కాంగ్రెస్ నాయకులు పత్తిపాక త్రిమూర్తి, పంగా రాకేష్, కిన్నెర ప్రశాంత్, ఎస్సీ సెల్ నాయకులు బెజ్జంకి సారయ్యనందారావు సంపత్ కాశ పోయిన రవి బండి శ్రీనివాస్ బందారపు రాజయ్య ఉల్లంగుల రాజు కన్నారం చందర్ లింగారెడ్డి వివిధ గ్రామ శాఖల అధ్యక్షులు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

కనుల పండువగా ఆషాఢ త్రిరాత్రోత్సవాలు

నవతెలంగాణ-మర్కుక్

అపర పండరీపురంగా భాసిల్లుతున్న సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని బావానందపూర్ శివారులో గల పాండురంగాశ్రమంలో బుధవారం 92వ ఆషాడి త్రిరాత్రోత్సవాలు అంగరంగవైభవంగా కన్నుల పండుగగా ఉదయం పుష్పగిరి పీఠాధిపతి శంకరాచార్య మహాసంస్థానం పీఠాధీశ్వరులు అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామి కరకమలములచే ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులకు స్వామివారి అనుగ్రహ భాషణం అనంతరం త్రిరాత్రోత్సవ సంకల్పం పుణ్యాహవాచనం, మేలతాళాలతో త్రిరాత్రోత్సవ అఖండ భజన, ఈ భజన శుక్రవారం వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. రుక్మిణీ పాండురంగస్వామి వారికి 108 లీటర్ల గోక్షీరాభిషేకం, పుష్పార్చన, మహ పూజ, నీరాజనసేవ, అఖండనామసంకీర్తన నిర్వహించారు. ఇంతకు ఉదయం పుష్పగిరి శంకరాచార్యులు విద్యాశంకరభారతి స్వామి కి ఆశ్రమ నిర్వాహకులు వేద పండితుల మంత్రోత్సవాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వేద పండితులు తదితరులున్నారు.

సురభి కాలేజీలో పీవీ జయంతి

నవ తెలంగాణ- గజ్వేల్

పీవీ నరసింహారావు జన్మదిన సందర్భంగా స్థానిక సురభి ఫార్మసీ కాలేజీలో ఎంపీపీ శ్రీ దాసరి అమరావతి శ్యా%శ్రీ% మనోహర్ %శ్రీ% అధ్యక్షతన జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నటువంటి ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తలదన్నే విధంగా ఉండడానికి కారణము పీవీ నరసింహారావుకి కృషి అతను చేసినటువంటి ప్రణాళికలే దేశ ఆర్థిక వ్యవస్థను ఉన్నతమైన స్థితిలో ఉంచడానికి కారణమైనదియని వివరించారు. ఇలాంటి గొప్ప మహనీయుడు మన తెలంగాణలో పుట్టడం అనేది తెలంగాణ ప్రజలు చేసుకున్నటువంటి పుణ్యం అని కొనియాడినారు. అదేవిధంగా విద్యార్థులను ఉద్దేశిస్తూ మీరు కూడా అంతటి మహోన్నతమైన వ్యక్తి యొక్క అడుగుదారుల్లో ఆశయ సాధనలో నడుస్తూ అంత మంచి పేరు ప్రఖ్యాతలు తల్లిదండ్రులకు కాలేజీ యాజమాన్యానికి తీసుకురావాలని సూచించారు.

దరఖాస్తుదారుల ఆందోళన

నవ తెలంగాణ - సిద్దిపేట

కస్తూరిబా గాంధీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులను జిల్లావారీగా ఆలస్యంగా ఖాళీలను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించడంతో ముందే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆర్థికంగా నష్టపోయారని, దరఖాస్తు మొత్తాన్ని తిరిగి అభ్యర్థులకు చెల్లించాలని టిఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి టీ. యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత నెల రాష్ట్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు పూర్తికావడంతో ఈనెల 17న ఖాళీలను నోటిపై చేస్తూ కొత్త నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం 26 నుంచి జులై 5 వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ప్రతికా ప్రకటన ఇవ్వడం జరిగిందని, జిల్లాల వారీగా ఖాళీలను మాత్రం 27న ఆలస్యంగా ప్రకటించడంతో అప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ జిల్లాలో ఎలాంటి ఖాళీలు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారని అన్నారు. ఒక్కొక్క అభ్యర్థి ఐదారు పోస్టులకు అప్లై చేసుకోవడంతో సగటున రూ1800 నష్టపోయారని, నిరుద్యోగులకు న్యాయం చేసే విధంగా 26, 27 న దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డబ్బులను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.